# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 4-10-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 59 పేజీలు 8 వెల: రూ.1/-


## మధ్యప్రదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం

**ఫ్లై ఓవర్ నుంచి కిందకు పడ్డ బస్సు**

**ప్రమాదంలో ఆరుగురు మృతి**

భోపాల్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్ రాష్ట్రం రైసేన్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. ఫ్లైఓవర్ పైనుంచి బస్సు అదుపుతప్పి నదిలో పడటంతో ఆరుగురు ప్రయాణికులు మృతిచెందారు. మరో 19 మంది ప్రయాణికులు గాయపడ్డారు. మృతుల్లో నలుగురు పురుషులు, ఓ మహిళ, రేండేళ్ల బాలుడు ఉన్నారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. బస్సు రైసేన్ నుంచి ఛత్తార్‌పూర్‌కు వెళ్తుండగా ప్రమాదం బారిన పడింది. సమాచారం తెలిసిన వెంటనే పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు.

# కొత్త మద్యం విధానం ప్రకటించిన ప్రభుత్వం

**నవంబర్ 1 నుంచి ఏడాది పాటు అమలు**

**నాలుగు స్లాబుల నుంచి ఆరు స్లాబులకు పెంపు**

**కనిష్ట లైసెన్స్ ఫీజు 50 లక్షలు..గరిష్టంగా కోటి 20 లక్షలు**

**జిమెచ్‌ఎంసి పరిధిలో ఉదయం 10నుంచి రాత్రి 11 గంటల వరకు దుకాణాలు**

**గ్రామాల్లో 10 నుంచి రాత్రి పది వరకు అనుమతులు**

**లైసెన్స్ దరఖాస్తుకు 2లక్షల ఫీజు నిర్ణయం**

హైదరాబాద్,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని ప్రకటించింది. నూతన మద్యం విధానానికి సంబంధించి గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. నవంబర్ ఒకటి నుంచి కొత్త మద్యం విధానం అమలులోకి రానుంది. ఇప్పటికే ఓ నెల పాటు మద్యం దుకాణాలకు గడువు పెంచింది. అక్టోబర్ 1 నుంచే కొత్త మద్యం విదానం అమల్లోకి రావాల్సిఉన్నా నెల ఆలస్యంగా ఈ విదానం అమలు కానుంది. కొత్త విధానంలో కూడా జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులు ఖరారు చేయనుంది. గతంలో ఉన్న 4 స్లాబులను 6 స్లాబులుగా ప్రభుత్వం మార్చింది. 5 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాలకు రూ. 50 లక్షల లైసెన్స్ ఫీజు. 5 వేల నుంచి 50 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు.. 50 వేల నుంచి లక్ష జనాభా ప్రాంతాల్లో రూ.60 లక్షలు.. లక్ష జనాభా నుంచి 5 లక్షల లోపు ఉన్న ప్రాంతాలకు రూ.65 లక్షలు..5 లక్షల నుంచి 20 లక్షలలోపు జనాభా ప్రాంతాలకు రూ.85 లక్షలు.. 20 లక్షలకు పైగా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.1.10 కోట్ల లైసెన్స్ ఫీజుగా ప్రభుత్వం నిర్ణయించింది. మద్యం దుకాణాల కోసం నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజును రూ.2 లక్షలు చేసింది. తెలంగాణ రాష్ట్రంలో 2,216 దుకాణాలకు లాటరీ పద్ధతిన దుకాణదారులను ఎంపిక చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. మద్యం షాపులు తెరచి ఉంచే సమయాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, ఇతర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలకు అనుమతి ఇస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. నవంబర్ 1, 2019 నుంచి అక్టోబర్ 31, 2021 వరకు కొత్త మద్యం విధానం అమల్లో ఉండనుంది. ఈ సారి జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులను ప్రభుత్వం ఖరారు చేసింది. గతంలో ఉన్న 4 స్లాబులను 6 స్లాబులుగా మార్చింది.

# దేశంలో చొరబడ్డ జైషే ఉగ్రవాదులు

**జనసమ్మర్థం ఉన్న చోట పోలీసుల గస్తీ**

**విమానాశ్రయాల్లో హై అలర్ట్**

న్యూఢిల్లీ,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): దేశంలోకి ఉగ్రవాదులు దూరారన్న హెచ్చరికలతో దేశవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. అమెరికా హెచ్చరికలకు తోడు ఐబి హెచ్చరికలతో ఉత్తరాదిలో ఉన్న అన్ని విమానాశ్రయాల్లో భారీ భద్రతను పెంచారు. ఢిల్లీలో నలుగురు జైషే ఉగ్రవాదులు చొరబడినట్లు ఇంటెలిజెన్స్ హెచ్చరికలు రావడంతో భద్రతను పటిష్టం చేశారు. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే హై అలర్ట్ ప్రకటించారు. ఢిల్లీకి చెందిన స్పెషల్ సెల్ నుంచి హెచ్చరికలు వచ్చినట్లు తెలుస్తోంది. నలుగురు ఉగ్రవాదులు భారీ ఆయుధాలతో ఢిల్లీలోకి ప్రవేశించినట్లు సమాచారం ఉన్నది. హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీతో పాటు సమీప పట్టణాల్లో భారీ స్థాయిలో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ హెచ్చరికల గురించి గురువారం ఉదయం ప్రధాని మోదీ నివాసంలో చర్చ జరిగింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉన్నట్లు భద్రతా దళాలకు హెచ్చరికలు అందాయి. మోదీ, షా, దోవల్‌కు ఉగ్ర ముప్పు ఉన్నట్లు ఇటీవల ఇంటెలిజెన్స్ హెచ్చరించింది కూడా. శ్రీనగర్, అవంతిపురా, జమ్మూ, పఠాన్‌కోట్, హిండన్ లాంటి వైమానిక స్థావరాల వద్ద ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. దీంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నలుగురు ఉగ్రవాదులు భారీ ఆయుధాలతో ఢిల్లీలోకి ప్రవేశించారని, ఢిల్లీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. జన సమ్మర్థం ఉన్న చోట దాడులకు ఈ నలుగురు ఉగ్రవాదులు కుట్ర చేశారని నిఘా వర్గాలు ఢిల్లీ పోలీసులను అప్రమత్తం చేశాయి. జమ్మూకశ్మీర్ విభజన, ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ ఉగ్రవాదులు దేశంలో దాడులకు పాల్పడే అవకాశం ఉండడంతో దేశ వ్యాప్తంగా ఉన్న ఉగ్రవాద ప్రభావిత నగరాలతో పాటు పెద్ద నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారు.

# కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడతా

**బాధ్యతలు స్వీకరించిన మంత్రి గంగుల కమలాకర్**

**అభినందించిన మంత్రి హరీష్ రావు**



. ఖైరతాబాద్ బిసి కమిషన్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించిన మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో మంత్రి హరీష్ రావు తదితరులు ఉన్నారు.

హైదరాబాద్,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో పౌరసరఫరాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా గంగుల కమలాకర్ బాధ్యతలు స్వీకరించారు. మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి మంత్రి హరీష్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవి ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రెండు శాఖల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు సేవ చేసే అవకాశం ఇచ్చారని అన్నారు. సీఎం కేసీఆర్ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయను అని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం జలాలు తీసుకొచ్చారు. ఖరీఫ్‌లో ధాన్యం పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం. బియ్యం గింజ కూడా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా చర్యలు తీసుకుంటాం అని మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ప్రతీ బిడ్డ కూడా చదువుకోవాలన్న సంల్పంతో ముఖ్యమంత్రి గురుకులాలలను ఏర్పాటు చేశారన్నారు. కాగా కళ్యాణలక్ష్మికి సంబంధించి మొదటి సంతకం జరిగిందని, 2019-20 సంవత్సరానికి సంబంధించి రూ. 700 కోట్లను కేటాయించడం జరిగిందని చెప్పారు. ఇక గడిచిన ఐదేళ్ల కాలంలో పౌరసరఫరాల శాఖలో అక్రమాలకు సాంకేతికతతో అడ్డుకట్ట వేయడం జరిగిందన్నారు. ఇక ప్రజాపంపిణీ వ్యవస్థలో ఒక్క బియ్యపు గింజ కూడా నల్లబజారుకు తరలకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

**బిఆర్కె భవన్‌లో ఆంధ్రాబ్యాంక్**

నగరంలోని బూర్గుల రామకృష్ణ భవన్‌లో ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు ఆంధ్రా బ్యాంక్ బ్రాంచ్‌ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. ఆంధ్రా బ్యాంక్ అధికంగా ఖాతాలు కలిగి ఉన్నదని తెలిపారు. గ్రామీణ మహిళలకు ఆంధ్రా బ్యాంక్ మంచి సేవలు అందిస్తోందని ప్రశంసించారు. ఆంధ్రా బ్యాంక్‌కు ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాఖలు ఏర్పాటు చేయాలని ఆంధ్రా బ్యాంక్‌ను కోరుతున్నామని హరీష్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా బ్యాంక్ విలీనం చాలా బాధగా ఉందన్నారు.

ఆంధ్రాబ్యాంకు కొనసాగాలని కేసీఆర్ కూడా కోరుకుంటున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు మరిన్ని శాఖలు ఏర్పాటు చేయాలని మంత్రి హరీష్‌రావు అన్నారు.



ఖైరతారాబాద్ బిసి కమిషన్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించిన మంత్రి గంగుల కమలాకర్‌ను అబినందించిన బిసి కమిషన్ ఛైర్మన్ బి.యస్.రాములు, సభ్యులు వకుళాభరణం తదితరులు

# బతుకమ్మకు హుస్సేన్ సాగర్ ముస్తాబు

**భారీగా ఏర్పాట్లు చేస్తున్న జిహెచ్‌ఎంసి**

**ఆకట్టుకోనున్న స్వాగత తోరణాలు...కటౌట్లు**

హైదరాబాద్,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): సద్దుల బతుకమ్మ ఉత్సవానికి నగరంలోని హుస్సేన్ సాగర్ తీరం ముస్తాబవుతోంది. గతనెల 28న ఎంగిలిపువ్వుతో ప్రారంభమైన బతుకమ్మ ఈనెల 6న సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నది. చివరిరోజైన సద్దుల బతుకమ్మ జరిగే ట్యాంక్ బండ్‌తో పాటు పరిసర ప్రాంతాలన్నీ పండుగ వాతావరణం కనిపించేలా హెచ్‌ఎండీఏ ఏర్పాట్లు చేసింది. భారీ లైటింగ్‌లను, కటౌట్లను ఏర్పాట్లు చేస్తోంది. అలాగే ఆకట్టుకునే స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తోంది. దీనికితోడు నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో ఉంది. ఈ ఏడాది దాదాపు రూ.49 లక్షలతో బుద్ధభవన్ నుంచి సంజీవయ్యపార్క్, సాగర్ పార్క్ కలిపి ఐదు బతుకమ్మ ఘాటలకు పెయింటింగ్ వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతోపాటు ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్‌రోడ్‌లో ప్రత్యేక అలంకరణతో పాటు, లైటింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు ముఖ్యకూడళ్లలో బతుకమ్మ విశిష్టతను తెలుపుతూ పేపర్ బతుకమ్మలు, భారీ బెలూన్లు ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగ వేడుకలు జిల్లాల్లో ఘనంగా సాగుతున్నాయి. ప్రతి ఏడాది పెద్దఎత్తున బతుకమ్మ సంబురాలను వైభవంగా జరుపుతున్నారు. అందులో భాగంగా పెద్దఎత్తున మహిళలు బతుకమ్మలు పేర్చగా ఎల్‌బి స్టేడియంలో సద్దుల బతుకమ్మను నిర్వహిస్తున్నారు. గతంలో బతుకమ్మ పండుగకు ఆదరణ కరువైతే, రాష్ట్రాన్ని సాధించాక కేసీఆర్ నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి ఏటా ఘనంగా నిర్వహిస్తున్నది. బతుకమ్మ పండుగ కీర్తిని ప్రపంచానికి చాటేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత విదేశాల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించి దేశ ఖ్యాతిని చాటిచెప్పారు. సాంస్కృతిక శాఖ పర్యవేక్షణలో సద్దుల బతుకమ్మ పండుగకు సకల ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు.

**ఐటి ఉద్యోగుల వినూత్న ప్రయత్నం**

బతుకమ్మ సంబురాలను సందేశాత్మకంగా నిర్వహించాలని ఐటీ ఉద్యోగులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పూలతో దర్శనమిచ్చే బతుకమ్మను సాంకేతికతతో రూపొందించనున్నారు. ఐటీ రంగంలో నూతన, ఉత్తమ ఉపాధి వేదికలుగా నిలుస్తున్న తొమ్మిది టెక్నాలజీస్‌తో టీటా (తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్) ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించనున్నారు. హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో చేపట్టనున్న ఈ టెక్ బతుకమ్మ ప్రత్యేక కార్యక్రమాన్ని ఐటీ, పరిశ్రమలశాఖల ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ప్రశంసించారు. ఐటీ రంగంలో ఉపాధి కోరుకుంటున్న యువత ప్రస్తుతం ఉన్న టెక్నాలజీస్‌పై పట్టు సాధించేల ప్రేరణ కలిగించేందుకు సాంకేతిక బతుకమ్మను చేపట్టినట్టు టీటా ఫౌండర్ సందీప్‌కుమార్ మక్తాల తెలిపారు. ఇందులో భాగంగా బతుకమ్మ గోపురం 3డీ ప్రింటింగ్ డిజైన్‌తో రూపొందించబడి ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఓవర్ థింగ్స్(ఐవోటీ) ఆధారంగా బతుకమ్మ ఓపెన్ అవుతుంది. రోబోటిక్స్ రోవర్ సహాయంతో బతుకమ్మ తన చుట్టూ తాను తిరుగుతుంది. డ్రోన్ సహాయంతో ఆ పరిధిలో బతుకమ్మ చక్కర్లు కొడుతుంది. ఇలా పలు సాంకేతిక విశిష్టలతో బతుకమ్మ రూపుదిద్దుకోనున్నది

## ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ప్రమాదం

**రోడ్డు దాటుతున్న వ్యక్తిపై దూసుకెళ్లిన వాహనం**

హైదరాబాద్,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 47 సంవత్సరాల వయసున్న ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా.. అతన్ని గుర్తు తెలియని బైక్ ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి కిందపడిపోయాడు. వెనుక నుంచి వస్తున్న గ్యాస్ లారీ ఆ వ్యక్తి పైనుంచి దూసుకెళ్లడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. అలాగే కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## హైదరాబాద్-రామేశ్వరం మధ్య ప్రత్యేక రైళ్లు

**ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే**

హైదరాబాద్,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ నుంచి రామేశ్వరానికి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. హైదరాబాద్-రామేశ్వరం మధ్య ప్రత్యేక రైలు (07685) హైదరాబాదులో నవంబరు 1, 8, 15, 22, 29, డిసెంబరులో 6, 13, 20, 27 తేదీల్లో మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 12.15 గంటలకు రామేశ్వరం చేరుతుంది. సికింద్రాబాద్, నల్లగొండ, మిరియాలగూడ, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, వేలూరు (క్యాంట్), తిరువణ్ణామలై, విల్లుపురం, తిరుప్పాడి, చిదంబరం, మైలా డితురై, కుంభకోణం, తంజావూరు, తిరుచ్చిరాపల్లి, దిండిగల్, కొడైకెనాల్ రోడ్డు, మధురై, మాలైమధురై, పరమక్కుడి, రామనాథపురం, మండపం స్టేషన్ల మీదుగా రామేశ్వరానికి చేరుకుంటుంది. అలాగే రామేశ్వరంలో ఈ ప్రత్యేక రైలు (07686) నవంబరు 3, 10, 17, 24, డిసెంబరు 1, 8, 15, 22, 29 తేదీల్లో ఉదయం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు హైదరాబాదు నాంపల్లికి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలులో సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్ వసతులు ఉంటాయి.

## చరిత్రలో నేటినిజం




కం॥ జంతువులను ప్రేమించుడు!
జంతువులను ప్రాణులనెడి - సచ్ఛింతనతో
జంతువులను రక్షించుడు!
సంతతమును, సంతసమును చేతలనిలుపన్!!

*(అక్టోబర్ 4 జంతు సంక్షేమ దినోత్సవం..)*

-రాధశ్రీ

సెల్: 9494481210

## సాగర్ నుంచి నిలిచిన నీటి విడుదల

నాగార్జునసాగర్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్ ప్రాజెక్టు రెండు గేట్ల నుంచి నీటి విడుదలను ఆపేశారు. ఎగువనుంచి నీటి రాక తగ్గడంతో ఈ చర్య తీసుకున్నారు. వరద తగ్గిపోవటంతో శ్రీశైలం గేట్లను కూడా మూసివేశారు. మూసీకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గటంతో సాయంత్రం గేట్లు మూసివేశారు. ఎస్సారెస్పీలోకి కూడా వరద ప్రవాహం తగ్గిపోయింది. ఉదయం 11,857 క్యూసెక్కులు ఉన్న ప్రవాహం సాయంత్రానికి 4,040 క్యూసెక్కులకు తగ్గింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ లక్ష్మీ బ్యారేజికి వరద నీరు పోటెత్తింది. దీంతో 45 గేట్లను ఎత్తి 3.40 లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సరస్వతీ బ్యారేజి రెండు గేట్లను ఎత్తి దిగువకు 9 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా.. బ్యారేజీలోకి 22 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది.

## బెయిల్ కోసం సుప్రీంను ఆశ్రయించిన చిదంబరం

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ఐఎన్ఎక్స్ మీడియా కేసులో మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం సుప్రీంకోర్టు ను ఆశ్రయించారు. చిదంబరం తరపున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ కోర్టులో వాదించనున్నారు. జస్టిస్ ఎన్వీ రమణ బెంచ్ ఈ కేసును తక్షణమే చేపట్టాలని ఆయన పిటిషన్‌లో కోరారు. ఇదే బెంచ్‌లో జస్టిస్ సంజీవ్ ఖన్నా, కృష్ణ మురారీలు ఉన్నారు. అయితే చిదంబరం పెట్టుకున్న అభ్యర్థనను చీఫ్ జస్టిస్‌కు పంపనున్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో విచారణను ఎదుర్కొంటున్న చిదంబరం ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. సెప్టెంబర్ 30వ తేదీన ఢిల్లీ హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో చిదంబరం సుప్రీంను ఆశ్రయించారు. . ఐఎన్ఎక్స్ మీడియా కేసులో సీబీఐ అధికారులు చిదంబరాన్ని ఆగస్టు 21న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న చిదంబరానికి సెప్టెంబర్ 5న కోర్టు జ్యూడీషియల్ కస్టడీ విధించింది. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ సోమవారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. చిదంబరానికి బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారనే సీబీఐ వాదనతో ఏకీభవించిన కోర్టు.. ఆయన బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. చిదంబరం పిటిషన్‌ను స్వీకరించిన ఎన్వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం.. బెయిల్‌పై నిర్ణయాన్ని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్ వెల్లడిస్తారని తెలిపింది.

# రోజువారీ మార్కెట్‌లోని నిత్యకృత్యాలే.!

నేటినిజం

శుక్రవారం 4-10-2019

ఆరోగ్యానికి ఆకుకూరలు, కూరగాయలు చాలా మంచివి అనేది తెలిసిందే! కళ్ళల్లో వత్తులేసుకుని పండించిన వీటిని కడుపులో దాచుకున్నట్టు బుట్టలో మూటల్లో దాచి, ప్రాణానికి మిన్నగా భావించి, తన ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా తెలవారక ముందే మార్కెట్‌కు తరలిస్తాడు రైతు. గంపెడంత ఆశతో మాటల్లో చెప్పలేని బాధతో వాటిని అమ్మకానికి పెడతాడు. మూడ విప్పకముందే రాబందుల్లా చిలకపలుకుల్లో దళారీలు మీద పడతారు. ధర ఇంతేనంటూ బేరం చేయకుండానే తన్నుకుపోతారు. చేస్టలుడిగిన రైతు చేతిలో పెట్టింది తీసుకోవల్సిందే! లేదంటే తాను ఇస్తానన్న రోజు తీసుకోడనే దిగులు లేదా తాను అమ్ముదామనుకుంటే మార్కెట్లో ఓ చదరపు అడుగు దొరకడం కష్టం. దొరికిన చోట కూర్చుంటే నీ జాగీరా!

అంటూ అక్కడే తిష్టవేసి అమ్ముకునేవారి దబాయింపు. మరోవైపు కూర్చోకముందే తై బజారు పేరున మార్కెడ్ సెస్ టికెట్లు మూటలపై పడతాయి! అయ్యా! బేరం రాలేదు. బోణీ కాలేదు అని అంటే నాకనవసరం..తియ్యి” అంటూ బెదిరి ంపులు.. అమ్మినంక ఇస్తా! యాడికిపోత...“నిన్నెట్లా నమ్మేది? అమ్మి దొంగలా పోతే నా బతుకేం కాను?” అనే అరుపులు, ఈసడింపులు.. చిన్నాపెద్దా మూట అనే తేడా లేకుండా సంఖ్యను బట్టి పది, ఇరవై వసూలు చేయడం అందరు చూస్తూనే ఉంటారు. కనికరం అనే పదమే తెలియని సదరు ఏజెంట్లు, డబ్బులివ్వకపోతే మూటల్ని గుంజడం, తక్కెళ్ళను, బాట్లను, ఎత్తుకుపోవడం రోజువారీ మార్కెట్‌లోని నిత్యకృత్యాలే!ఇవన్నీ రోజువారిగా కూరగాయలమ్మే మార్కెట్ మాత్రమే! పట్టణ ప్రాంతాల్లో రేకుల షెడ్లు, దుకాణాల సముదాయాలు ఉంటాయి. పెద్ద గ్రామ పంచాయితీ స్థాయిలోనైతే ఖాళీ స్థలాలుంటాయి. వీటిని కేవలం కూరగాయలు అమ్మేవారే ఉపయోగించుకోవాలి. కానీ ఈ అలవాటు ఎక్కడా కనిపించదు. పట్టణ మున్సిపల్ ప్రాంతాల్లో అయితే దుకాణాలన్నీ బినామీ పేర్లపై ఉంటే షెడ్లన్నీ హెూల్‌సేల్ వ్యాపారులే ఆక్రమించుకుంటారు. కూరగాయలే అమ్మాల్సిన ఈ దుకాణ సముదాయాల్లో కిరానా టీకొట్లతోపాటు మాంసాహారాన్ని అమ్మే వాటిగా మారిపోతాయి. రోజు వారిగా అమ్మకానికి వచ్చే రైతులకు స్థలమే దొరకని పరిస్థితి. దాంతో రైతు దళారులకు వారు ఇచ్చేంత ధరకే అమ్మాల్సి వస్తోంది. లేదా అమ్ముకుందామంటే స్థలం లేక ఆ ఇరుకు సందులన్నీ ఇబ్బంది కరంగా ఉంటాయి. అయినా వీటన్నింటినీ అధిగమిస్తూ అమ్ముతూ ఉంటారు. ఇక వారాంతపు సంతల్లో కూరగాయలతోపాటు అనేక రకాల వస్తువులు అమ్మకానికి తెస్తుంటారు. దీనికి తోడు పశువుల సంత కొనసాగుతుంది. స్థలం పిడికెడయితే సంత మూరెడులా సాగుతుంది. సందులు, గొందులు, మురికి కాలువలు గట్లు కూడా సరిగా కనిపించవు. ప్రజాధనాన్ని అప్పనంగా తగలేసే నాయకులు విదేశాల్లో కొనసాగుతున్న మంచి విషయాల్ని ఆకళింపు చేసుకున్నట్టు ఏనాడు కనిపించదు. వ్యక్తిగత లబ్ధిని పొందాలనే ఆలోచన తప్ప సామాజిక సంక్షేమాల్ని కాంక్షించని నాయకులున్నంత కాలం ఈ దేశగతి ఇంతే!

## జనరిక్ మందులపై దృష్టి పెట్టని అధికారులు

### చట్టం ఉన్నా పట్టించుకోని వైనం

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): మార్కెట్‌లో లభించే మందులతో పోలిస్తే జెనరిక్ మందులపై 40 నుంచి 80 శాతం తక్కువ ధరకు లభిస్తాయి. జనరిక్ మందులు సురక్షితమైనవే గాకుండా ప్రభావవంతం అయినవి కూడా. ఈ మందులను మాత్రమే వైద్యులు రోగికి చీటీలో స్పష్టంగా రాయాలి. ఈ మందుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలి. జనరిక్ ఔషధాలను అందుబాటులోకి తీసుకుని వస్తే ఈ సమస్యలు ఉండవని భావిస్తున్నారు. జన్‌ఔషధి దుకాణాల ఏర్పాటును 2007లో పార్లమెంటు ఆమోదం లభించింది. సామాన్యులకు తక్కువ ధరకు మందులను అందించే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేయడానికి ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు ఈ దుకాణాల్లో తక్కువ ధరకే దాదాపు 700 రకాలను అందుబాటులో ఉంచారు. కేవలం జన్‌ఔషధి వారు తయారు చేసిన మూలక ఔషధాలన్నీ ఇందులో లభ్యం అవుతు న్నాయి. బ్రాండెడ్ కంపెనీల మందులు, జెనరిక్ ఔషధ ధరల్లో భారీగా తేడా ఉంటుంది. పెద్ద సంస్థలు ప్రచారం, ప్రకటనలు, వైద్యులకిచ్చే పారితోషికాలు, నజరానాల విలువను కూడా ఇందులో కలిపి విక్రయించడం వల్ల వీటి ధర అధికంగా ఉంటుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో జనరిక్ ఔషధాలనే కొనుగోలు చేస్తున్నారు. వీటితో మంచి ఫలితాలు ఉండటంతో పాటు తక్కువ ధరకు వస్తున్నాయని చెబుతున్నారు. ఒక్కో వ్యాధి ఒక్కో ఔషధ మూలకంతో నయం అవుతుంది. అది నయం కావడానికి ఏ కంపెనీ అయినా నిర్దిష్ట మూలకంతోనే మందులను తయారు చేయాలి. జెనరిక్ ఔషధాల్లో వాడిన మూలకమే స్వదేశీ, విదేశీ కంపెనీల ఉత్పత్తిదారులు వాడుతారు. ఈ రెండింటిలోనూ మూలకం ఒక్కటే ఉంటుంది.. ధర మాత్రమే తేడా. గర్భిణులకు రక్తహీనత నివారించడానికి ఎక్కువగా రాసే ఐరన్‌ఫోలిక్ మాత్రలు జనరిక్‌వి అయితే రూ.40కి పది లభిస్తుండగా, బ్రాండెడ్ మాత్రలు రూ.100 వరకు ధర ఉంటుంది.

## సింగరేణి కార్మికుల వేతనాలు పెంచాలి

### పదోన్నతులతో పాటు ఖాళీల భర్తీ చేపట్టాలి

కొత్తగూడెం,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సింగరేణి కార్మికుల వేతనాలు యాభై శాతం పెంచాలని, పింఛన్‌ను 40 శాతం పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కార్మికులకు పదోన్నతులు కల్పించి, క్లరికల్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. సింగరేణి చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రస్తుత వార్షిక సంవత్సరంలో కంపెనీకి రూ.వెయ్యి కోట్లకు పైగా లాభాలు వస్తున్నాయన్నారు. సింగరేణిలోని ఐదు భూగర్భగనుల్లో పొరుగు ఔట్‌సోర్సింగ్ ద్వారా బొగ్గును వెలికితీసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తుందని, ఈ విధానం సరికాదని అన్నారు. పొరుగు సేవల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బొగ్గును ఉత్పత్తి చేసేందుకు యజమాన్యం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందన్నారు. దీనివల్ల ఉపరితల గనుల్లో మాదిరిగా భూగర్భ గనుల్లో ముఖ్యమైన పనులు కాంట్రాక్టు కార్మికులే చేయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ఉపరితల గనుల్లో 75 శాతం పనులను కాంట్రాక్టు కార్మికులు చేస్తుంటే కేవల 25 శాతం పనులను కంపెనీ ఉద్యోగులు చేస్తున్నారన్నారు. సింగరేణిలోకి పొరుగు సేవల వినియోగం ఎక్కువైతే రానున్న రోజుల్లో కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. సింగరేణిలోని గోలేటి-1ఏ గనిని, ఇల్లందు 21 గనిని, గోదావరిఖని 10ఏ గనులను మూసివేసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. ఎన్నికల సందర్భంగా సింగరేణిలో కొత్త భూగర్భ గనులను తీసుకువచ్చి ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్న కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు భూగర్భ గనుల మూసివేతను నిలిపివేయాలన్నారు. సింగరేణి ప్రైవేటీకరణకు యాజమాన్యం ప్రయత్నిస్తుంటే గుర్తింపు సంఘం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. శ్రీరాంపూర్ ఉపరితలగనిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

## చెరువుల రక్షణపై అధికారుల దృష్టి

వరంగల్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో చెరువులు అలుగు పోస్తున్నాయి. అనేక చెరువులు నిండాయి. దీంతో సహాయక చర్యలుముమ్మరం చేశారు.

అలాగే మరో రెండురోజులు వర్షాలకు అవకాశం ఉందని చెప్పడంతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు వచ్చాయి. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, చెరువులను సంరక్షించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు కూడా తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రత్యేకంగా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. జిల్లాలో మత్తడి పడుతున్న ప్రతి చెరువులను పర్యవేక్షించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టం అంచనా వేయాలని సూచించారు. ప్రధానంగా చెరువుల రక్షణకుచర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాల తీవ్రత తగ్గే వరకు అధికారులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ఎవరికీ సెలవులు మంజూరు చేయొద్దని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా బుంగ పడ్డ చెరువులకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని, లేదా గండ్లు పడే అవకాశముందని హెచ్చరించారు.

# ఆయుష్మాన్ భారతం ఇంకెన్నాళ్లు?

హైదరాబాద్, అక్టోబర్ 3:ఆయుష్మాన్ భారత్ కల సాకారం అయ్యేలా లేదు. దేశంలో ప్రజలు తమ సంపాదనను వైద్యానికే ఖర్చు చేయాల్సి దుస్థితి దాపురిస్తోంది. ఆయుష్మాన్ భారత్ పేరుతో కేంద్రం కొత్తగా ఆరోగ్య సౌకర్యాలను కల్పించినా, రాష్ట్రాలు ఆరోగ్యశ్రీ పథకాలు ప్రకటించినా ప్రభుత్వ పరంగా ఆస్పత్రులను బలోపేతం చేస్తే తప్ప సమస్యలు తీరేలా లేవు. క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. జాతిపిత గాంధీ పేరు నిత్యం వల్లిస్తున్న నేతలు ఆయన ఆశయాలకు అనుగుణంగా గ్రామాలను ఆరోగ్యపరంగా అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి. పల్లెల్లో స్వచ్ఛ వాతావరణం కలిగేలా చూడాలి. ఆస్పత్రులను పటిష్టం చేయకుండా ఎన్ని పథకాలు ప్రవేశ పెట్టినా లాభం లేదన్న విషయాన్ని పాలకులు గుర్తించడం లేదు. పథకాలతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆర్థికంగా బలోపేతం చేయడం తప్ప మరోటి కాదు. ప్రభుత్వ రంగంలో వైద్యం అందుబాటు లోకి రావడం లేదు. పథకాలు ప్రవేశ పెడుతున్నా అవి అమలు కావడం లేదు. కనీసం మందులన్నా చవకగా దొరుకు తాయన్న భరోసా లేదు. వైద్యరంగం ఖర్చుతో కూడుకున్నదిగా మారింది.

చికిత్సలు ఒక ఎత్తయితే, చికిత్సానంతరం ఔషధాల ధరలు మరో ఎత్తుగా మారాయి. సామాన్యులకు వైద్య ఖర్చులు భరించరాని వేదనగా మారుతోంది. ఇన్సూరెన్స్ చేయించుకున్నా సవాలక్ష కారణాలతో సమయానికి అందడం లేదు. రోగం వస్తే చాలు మందుల కొనుగోళ్లకే ఇల్లు గుల్ల చేసుకోవాల్సిన పరిస్థితి ప్రస్తుతం దాపురించింది. ప్రధానంగా ఆస్పత్రుల్లో ఎక్కువ భాగం మందులకు కూడా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇటీవలి కాలంలో మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో సామాన్యలకు మందుల భారం కూడా విపరీతంగా పడుతోంది. అధికారంలో ఉన్న వారు ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలకు మాత్రం వెతలు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో మంచి రోజులు వస్తాయమని భావిస్తున్న అమలులో మాత్రం అడుగు పడడం లేదు. బడా ఔషధ కంపెనీలు తమ ఉత్పాదనలను అధిక ధరలకు విక్రయించడం వల్లే ఈ పరిస్థితి నెలకొంటుంది. దీన్ని నివారించడానికి కేంద్ర ప్రభుత్వం తక్కువ ధరకు జనరిక్ మందులను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. జనఔషధి దుకాణాలు ఏర్పాటు, జనరిక్ మందుల దుకాణాలకు విరివిగా అనుమతు లిచ్చింది. జనరిక్ ఔషధాలను అందుబాటులోకి తేవడం, మందుల పేర్లను స్పష్టంగా రాయడం వంటి ఆదేశాలు ఉన్నా అవి అమలు కావడం లేదు. గ్రామాల్లో అసలు ఈవిషయాలు తెలియక పోవడంతో అమాయకులు దోపిడీకి గురవుతున్నారు. గ్రామాల్లో జనరిక్ ఔషధాలంటే ఏమిటనే స్థాయి ఇంకా ఉంది. వైద్యులు రోగికి రాసి ఇచ్చే ప్రిస్కిప్షన్‌లో విధిగా మూలకం పేరు పెద్ద అక్షరాల్లో రాయాలి. జెనరిక్ మందులను ప్రోత్సహిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించిన నేపథ్యంలో ఎంసీఐ తాజీగా ఈ ఆదేశాలను జారీ చేసింది. అవగాహన లేక ఆదరణ కరవవుతోంది. జనరిక్ మందులు అందుబాటులోకి వస్తే దాదాపుగా రోగికి సగం ఖర్చుల భారం తగ్గుతంది. కానీ ఆ దిశగా ప్రయాత్నాలు సాగడం లేదు. కనీసం ప్రభుత్వ ఆస్పత్రులకు అనుబంధంగా వీటిని అందుబాటులోకి తీసుకుని రావాలి. వైద్యులు వీటినే రాసేలా కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజలకు నష్టం తప్పేలా లేదు. అలాగే ప్రైవేట్ వైద్యులపై కఠిన చర్యలు కూడా ఉండాలి. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పెద్ద ఔషధ సంస్థలు వారి ఉత్పాదనలకు ఆకర్షణీయమైన పేర్లు పెట్టుకొని ప్రచార ప్రకటనలకు భారీగా వ్యయం చేసి,తమ బ్రాండ్ మందులను అత్యధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసు కుంటున్నారు. దీని కోసం పలు సంస్థలు వాటిని ఎక్కువగా విక్రయించడానికి మెడికల్ ఎగ్జిక్యూటివ్‌లను నియమించుకొని వారితో వైద్యుల వద్ద విస్తృత ప్రచారం చేయిస్తున్నారు. తమ మందులు విక్రయింపచేస్తే కొంత శాతం నగదు నజరానా ఇస్తామని, విదేశీ పర్యటనలు ఉంటాయని లేదా విలువైన వస్తువులు అందచేస్తామని, స్కీంలు ఎరచూపి వైద్యులతో తమ సంస్థ మందులు విక్రయమయ్యేలా చేస్తున్నారు. వీటికి కొందరు వైద్యులు ఆకర్షితులై వాటినే ప్రోత్సహిస్తు న్నారు. వారి లాభం కోసం వీటిని రోగులకు అంటగడుతున్నారు.

సామాన్యులు మాత్రం వైద్యుల స్వార్థంతో ఆర్థికంగా నష్టపోయి ఇల్లుగుల్ల చేసుకుంటున్నారు. కమిషన్‌తో పాటు,బహుమతుల రూపంలో భారీగా లాభం చేకూరు తుండటంతో వైద్యులు సైతం వాటి వినియోగానికే ప్రాధాన్యమిస్తునా న్రరు. ప్రాణాలతో చెలగాటం ఎందుకని భయపడి వైద్యులు ఏవి సూచిస్తే వాటినే రోగులు విధిలేక వాడుతున్నారు. మరోవైపు నర్సింగ్ హోంలు, ఆసుపత్రులు నిర్వహించే వైద్యులందరికి దాదాపుగా వారి సొంత దుకాణాలే ఉన్నాయి. జెనరిక్ ఔషధాల విక్రయం వల్ల తక్కువ లాభం వస్తుందని.. వాటిని ప్రోత్సహించటానికి ఆసక్తి చూపడం లేదు. పెద్ద ఔషధ కంపనీలు భారీగా ప్రకటనలతో పాటు తమ ఉత్పాదనలను విక్రయించుకోవడానికి వైద్యులకు భారీగా నజరానాలు ప్రకటిస్తూ రోగులను ఆర్థికంగా దివాలా తీయిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు దేశ ఆరోగ్య రంగాన్ని బాగు చేయలేదని కేంద్రం గుర్తించాలి. ఆస్పత్రులను అభివృద్ధి చేసే దిశగా చర్యలకు పూనుకోవాలి. వైద్యరంగాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి వాటిని ప్రభుత్వ ఆధీనంలో నడిపించాలి. వైద్యుల నియామకంతో పాటు ఆధునిక యంత్రపరికరాలను సమకూర్చాలి. ప్రభుత్వ ఆస్పత్రులు బలోపేతం అయితే ప్రైవేట్ రంగంలో కూడా వైద్య ఖర్చులు దిగి రాగలవు. లేకుంటే రోజురోజుకూ వైద్యం అందని ద్రాక్ష కాగలదు. గాంధీజీ ఆశయ సాధనకు అంతా కలసి నడిస్తేనే ఆయనకు నిజమైన నివాళి కాగలదు.

### పరస్పర ఆరోపణలతో సమస్యలు పక్కకు

# ఉల్లి ధరలను పట్టించుకోని పాలకులు

### ప్రజల డబ్బుతో జల్సాలు చేస్తున్న నేతలు
### హామీలను మరుగున పరుస్తున్న పార్టీలు

న్యూఢిల్లీ,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): ఎన్నికల హడావిడిలో అన్ని పార్టీలు పరస్పర ఆరోపణలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి తప్ప ప్రజలకిచ్చిన వాగ్దానాలను పట్టించుకోవడం లేదు. పాలకులు ఎవరికివారు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చామని చెప్పుకుంటున్నారు. ప్రధానంగా బిజెపి, టిఆర్‌ఎస్‌లు తామంతా ఘనకార్యం చేశామనే ప్రగల్భాలకు పోతున్నారు. దేశం మొత్తం మార్చేశామని, బిజెపి నేతలు చెప్పుకుంటుంటే, తాము తెలంగాణను ప్రగతిపథంలో ముందుంచామని అధికార టిఆర్‌ఎస్ ధంకాబజాయిస్తోంది. రానున్న ఎన్నికల్లో అధికార బిజెపి ఇంకా కాంగ్రెస్ బూచిచూపి ఓట్లను దండుకోవాలని చూస్తోంది. కేంద్ర రాష్ట్రాల్లో ఏ మేరకు హామీలు అమలు చేశారన్నది ప్రజల స్పందనను బట్టి గమనించాలి. అంతేగానీ ఎవరికి వారు తామంతా బ్రహ్మాండంగా పనిచేశామంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో ఉల్లి ధరలు ప్రభావం చూపేలా ఉన్నాయి. తెలంగాణలో హుజూర్‌నగర్ ఉప ఎన్నికకూడా అన్నిపార్టీలకు సవాల్లాంటిదే. ఉల్లి ధరల ఘాటు రాజకయీ పార్టీలకు షాక్ ఇచ్చేలా ఉంది. ప్రధానంగా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం వచ్చిన తరవాత సామాన్యుల కలలు సాకారమ య్యాయా..ఇచ్చిన హామీలు నెరవేరాయా అన్నది చూసుకోవాలి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దేశ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికలు జరుగుతన్న వేళ ఐదు రాష్ట్రాల్లో ప్రజలకు ఒనగూరిందేమిటన్నది ప్రజలంతా గతాన్ని నెమరేసుకుని సాగాల్సి ఉంది. స్వాంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా ఇంకా ఆకలిదప్పులు తప్పడం లేదు. అత్యాచారాలు పెరిగాయి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది. చదువుకుందామంటే అది ఖరీదైన వస్తువుగా మారింది. చదువులను కొనలేని దుస్థితి ఏర్పడింది. ఇలాంటి సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం గానీ తాము అనుకున్న రీతిలో పనులు చేస్తూ అవే ప్రజా సమస్యల పరిష్కారం అని తలపోసేలా పాలకులు వ్యవహరిస్తున్నారు. అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడమెలా అన్న ఆలోచనలకు అనుగుణంగా కార్యక్రమాలు చేయడం వల్లనే భారత్ ఇన్నేళ్ల తరవాత కూడా ఇంకా దారిద్య్రం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహార ధాన్యాల కొరతతో అలమటిస్తోంది. దేశంలో ఇప్పటికీ సరైన ప్రజారోగ్య వ్యవస్థ లేదు.వ్యవసాయ రంగం కుంగి కృశించిపోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్ప డుతునాన్రు. ఆహారధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. ప్రజలు స్వేచ్ఛగా బతికేలా, ఆర్థికంగా ఎదిగేలా, పనిచేసుకుంటే పనిదొరికేలా పాలన చేయాలి. కేవలం వాగాడంబరాలతో ఎంతోకాలం ప్రజలను మభ్యపెట్టలేమని గుర్తించాలి. తాము చేస్తున్న పనుల వల్ల క్షేత్రస్థాయిలో మార్పులు వచ్చాయా లేదా అన్నది పాలకులు గమనించడం లేదు. విమర్శలను సానకూల దృక్పథంతో తీసుకుని ముందుకు సాగడం లేదు. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. రాజకీయాలను పక్కన పెట్టి సానుకూలంగా ఆలోచన చేసి ముందుకు సాగాల్సి ఉంది. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో ఆలోచన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విసలాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకురాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారవే కనుక,ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని నిరూపితం అయ్యింది. అధికారవే పరమావధిగా ఇలాంటి ప్రజాస్వామ్యం కొనసాగితే మరో 72 ఏళ్లయినా మన భారత్ తలరాత మారదు. రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల ఆలోచనాతీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం వడాలి. అప్పుడే ప్రజలకు స్వాతంత్ర్య ఫలం దక్కుతుంది. అందుకు అనుగుణంగా మనవంతా సంస్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెతుతున్న వేళ పాలకులకు గట్టిగా బుద్ధి చెప్పేలా ప్రజలు తమ ఓటును వినియోగించుకోవాలి. గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాలిన అవసరం ఉంది. నోట్ల రద్దు తరవాత అనేక కష్టాలు పడుతున్నారు. మోడీ రాకతో ప్రజల్లో చిగురించిన ఆశలు వమ్మయాయి. జివిస్టీతో ప్రజలు మరింతగా కుంగిపోతున్నారు. జివిస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అదిచూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించుకోవాల్సిన మోడీ ప్రభుత్వం మొడిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు.

## పెరియార్ తరహా అడవుల్లో రక్షణ చర్యలు

### పులుల సంరక్షణ చర్యలతో దారికొస్తున్న స్మగ్లర్లు

ఆదిలాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): అడవులు అంతరించి పోతున్న క్రమంలో వాటి రక్షణకు గతంలో తీసుకున్న చర్యలు పెద్దగా ఫలితం ఇవ్వలేదు. పెరియార్ తరహా అడవుల రక్షణకు పరిశీలనజరిగినా ఆచరణలోమాత్రం ఇంకా ముందుకు సాగడం లేదు. గతంలో ఓ అధికార బృందం అక్కడికి వెళ్లి పరిశీలన చేసింది. కేరళలోని పెరియార్ పులుల సంరక్షణ ప్రాంతాన్ని సందర్శించి అక్కడి తీరుతెన్నులు అధ్యయనం చేశారు. అడవులతో పాటు జంతుజాలం సంరక్షణకు చేపట్టాల్సిన అంశాలు, నిర్వాసితుల పునారావాసం, పర్యటక ప్రాంత అభివృద్ధి తదితర అంశాలపై లోతుగా ఆలోచిస్తున్నారు. పెరియార్‌లో పులులతో పాటు వెయ్యికిపైగా ఏనుగులు సంచరిస్తున్నాయి. జిల్లా బృందం అక్కడి సాయుధ అటవీ సిబ్బంది సాయంతో ఆ ప్రాంతంలో పర్యటించారు. పలు ఏనుగులను అటవీ బృందం ప్రత్యక్షంగా చూసింది. ఇక బఫర్ ప్రాంతంలో సమీప ప్రజలకు ఉపాధికి మంచి అవకాశాలు కల్పించారు. సామాజిక సంబంధ పర్యావరణ పర్యటకంగా మంచి అభివృద్ధిని సాధిస్తున్నారు. మరోవైపు పెరియార్ పర్యాటకంగా కూడా బాగా ప్రాచుర్యం పొందింది. దీనికి తోడు అక్కడ వర్షపాతం ఎక్కువగా ఉండటం సతత హరిత అరణ్యాలు కావడంతో పర్యటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అందుకే దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యటకులు పెరియార్ పర్యటక ప్రాంతానికి వస్తుంటారు. అటవీ ప్రాంతంలో లభించే తేనే, మిరియాలు, ఇతర సుగంధ ద్రవ్యాలు అక్కడ విరివిగా ఉండటంతో ఉపాధికి మంచి అవకాశాలున్నాయి. మరోవైపు కలప అక్రమరవాణాను అడ్డుకోవడంతో పాటు వేటగాళ్లపై నిఘా పెట్టారు. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించనున్నారు. ఈ మేరకు సమీప గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఆదిలాబాద్ అడవుల్లో వేటగాళ్ల వల్ల పులుల సంగతేమో గాని ఇతర జంతువులు అంతరిస్తున్నాయన్న ఆందోళన ఉంది. ఇక్కడ కలపను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లావాసులకు పలుచోట్ల పులులు కనిపించాయని చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో పులుల సంరక్షిత ప్రాంతం మరింతగా అభివృద్ధి చేసేందుకు అటవీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కేరళలోని పెరియార్ తరహాలో రక్షణ చర్యలకు సిద్ధం అవుతున్నారు. ఇటీవల గ్రామాల్లో పులుల సంచారం కనిపించింది. పశువులపై దాడులు చేస్తున్నాయి. పులులకు క్రమంతప్పకుండా ఆహారం, ఇతర సదుపాయాలు కల్పిస్తే వాటి సంఖ్య పెరుగుతందని భావిస్తున్నారు. ఇలా జిల్లా అడవుల్లో శాఖాహార జీవులతోపాటు, మాంసాహార జీవుల సంఖ్యకూడా రోజురోజుకు తగ్గుతూ వస్తోంది. దీంతో గ్రామ సమీపంలో మేతకువెళ్లే ఆవులు, గొర్రెలు, మేకలను చంపి తింటున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని పెంచుకునే గ్రామీణ రైతులు నష్టపోతున్నారు. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో నీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. అక్కడక్కడా నీటి తొట్టెలను ఏర్పాటుచేసి వేసవి దాహం తీర్చేలా అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. వన్యప్రాణులకు వేసవి నీటి కొరత రాకుండా చూడాలని అటవీ అధికారులకు ఉన్నతాధికారుల సూచించారు. అలాగే అడవుల్లో వేటగాళ్ల బెడద ఎక్కువగా ఉంది. కుందేళ్లు, అడవికోళ్లు,జింకలను వేటాడి చంపుకు తింటున్నారు. ఈ జీవుల సంఖ్య ఉంటేనే పులుల సంఖ్య కూడా వృద్ధి చెందుతుందని నిపుణులు చెబుతున్నారు. చిన్న జంతువులు ఉంటేనే పులుల వేటకు అనుకూలంగా ఉంటుంది.

ఇలాంటి చిన్న జంతువుల మనుగడకు అనువైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడటంలేదు. అడవిలో కుందేళ్లు, జింకలు, మెకాలు, దున్నలు, మనుబోతులు తదితర శాఖాహార జీవుల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడానికి వేటగాళ్లే కారణమని తెలుస్తోంది. ఇక్కడి వేటగాళ్లకు తోడు కొందరు జిల్లాలోని అడవుల్లో సంచరిస్తున్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరేవారు సరిగ్గా రాత్రి సమయంలోనే అడవిని చేరుకుంటారు. అత్యాధునిక ఆయుధాలతో మనుబోతులు, దుప్పులు, కుందేళ్లను వేటాడి మాంసాన్ని తీసుకెళుతుంటారు. ప్రతి సంవత్సరం గణనీయంగా అడవిజంతువుల సంఖ్యకూడా తగ్గినట్లు తెలుస్తోంది.

## నెలరోజుల కోసం లైసెన్సుల రెన్యువల్

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ పాలసీ ఆలస్యం కావడంతో మద్యం లైసెన్స్‌లను ప్రభుత్వం నెల పాటు పొడిగించింది.

ఈ ఒక్క నెలకు సరిపడా లైసెన్స్ ఫీజు చెల్లించి మద్యాన్ని తీసుకోవచ్చని షాపుల యజమానులకు తెలిపింది. మొదటి ఇండెంట్ నుంచే 13.5 శాతం మేర ఎక్సైజ్ టర్నోవర్ ట్యాక్స్‌ను చెల్లిస్తేనే మద్యం సరఫరా చేస్తామని పేర్కొంది. దీనిపై మద్యం షాపు ఓనర్లు నిరసన వ్యక్తంచేశారు.

దీంతో లైసెన్స్ రెన్యూవల్‌కు డీలర్లు వెనక్కి తగ్గారు. ఈ క్రమంలో ఎక్సైజ్ అధికారులు, కానిస్టేబుళ్లు రంగంలోకి దిగి లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని బలవంతపెట్టినట్లు తెలిసింది. దసరా, దీపావళి పండుగ వేళల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్ముకున్నా పట్టించుకోమని అధికారులు హామీ ఇచ్చారని, దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో లైసెన్స్ రెన్యూవల్ చేసుకున్నట్లు వైన్స్ డీలర్లు చెబుతున్నారు.

# ప్లాస్టిక్ నిషేధంపై కానరాని చిత్తశుద్ధి

## ఉత్పత్తిదారులను కట్టడి చేయలేకపోతున్న అధికారులు

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ప్లాస్టిక్ వాడకం రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్లాస్టిక్ కవర్లపై నిషేధం ఉన్నా, అది కాగితాలకే పరిమితమవుతోంది. ఉత్పత్తిదారులను కట్టడి చేయకుండా నిషేధం విధించినా లాభం లేదని పర్యావేరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ ఉత్పత్తి కేంద్రాలను నియంత్రిం చాలని, కాగితం, బట్ట సంచులను ప్రోత్సహించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్ల తయారీదారులు, అమ్మకందారులపై అధికారులు అప్పుడప్పుడు మొక్కుబడిగా దాడులు నిర్వహించి, ఫైన్లతోనే సరిపెడుతున్నారు. షాపు ఓనర్లకు ఫైన్లు మామూలు స్థాయిలోనే ఉండడం, కవర్లు దొరుకుతుండటం, అవగాహన లేకపోవడం వల్ల కస్టమర్లు ఖాళీ చేతులతో షాపులకు, మార్కెట్లకు వస్తుండటంతో కవర్ల వాడకం తగ్గటం లేదు. దేశాన్ని పట్టి పీడిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అక్టోబర్ 2 నుంచి నిషేధిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ పంద్రాగస్టు వేడుకల ప్రసంగంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇండియాను 2022 వరకు ప్లాస్టిక్ రహిత దేశంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టంచేశారు. ఈ నిషేధం అమలుకు గడువు దగ్గర పడుతుండడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే కార్యాచరణను రూపొందించుకునే పనిలో పడ్డాయి. కానీ మన రాష్ట్రంలో మాత్రం ఈ విషయంపై ఇంకా ఎలాంటి కార్యాచరణ ఖరారు కాలేదు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రధాని ప్రకటన చేయడానికి ముందే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్‌పై నిషేధం విధించాయి. దేశంలోనే తొలిసారిగా మహారాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించగా, ఆ తర్వాత నిషేధం ప్రకటించిన రెండో రాష్ట్రం తెలంగాణెలే. మన రాష్ట్రంలో గతేడాది సర్కారు నిషేధం విధించింది. కానీ దీని అమలులో మాత్రం అధికార యంత్రాంగం చతికిలపడింది. ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ఎ÷–లాస్టిక్ వస్తువులకు నిషేధం వర్తిస్తుంది. అన్ని మున్సిపల్, గ్రామపంచాయతీల్లో వీటిని వాడరాదు. గ్లాసుల తయారీ కంపెనీలు, హోల్‌సేల్ దుకాణాలు, కూరగాయలు, పండ్లు, మాంసం, కిరాణా దుకాణాలు, ఫంక్షన్ హాళ్లను నియంత్రించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది.

రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాల్లో 80 శాతం వ్యర్థాలు హైదరాబాద్ నుంచే విడుదల కావడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా నగరంలో పర్యావరణ కాలుష్యంతోపాటు నదులు, చెరువులు, నీటి వనరులు కలుషితమవుతున్నాయి.

# సరస్సులకు పర్యాటక శోభ

## సెలవులతో పెరిగిన సందర్శకులు

వరంగల్,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): ప్రముఖ పర్యాటక కేంద్రం రామప్ప,పాకాల సరస్సులకు జలకళ సంతరించుకుంది. దసరా సెలవులతో ఉమ్మడి జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల రాకపెరుగుతోంది. పాకాలకు వర్షాలకు సహజంగానే నీరు రాగా, రామప్పకు మాత్రం దేవాదులతో నీటిని తరలిస్తున్నారు. అయితే గోదావరి నుంచి నీరు వస్తుంటే రామప్ప కూడా నిండే అవకాశాలు ఉన్నాయి. సరస్సులోకి దేవాదుల పైపులైను నుంచి 28 గంటల పాటు నీటిని మళ్లించారు. రామప్పలో సరస్సులో 2.912 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చని, ఈ లెక్కన సరస్సులోకి ఒక టీఎంసీ నీరు చేరాలంటే కనీసం 53 రోజుల సమయం పడుతుందని అధికారులు వివరించారు. సరస్సు ఎగువ ప్రాంతంలోని చలివాగు నుంచి ఎప్పటిలానే నీరు వస్తోంది. దీంతో పాటు సరస్సులోనే రెండో దశ మోటార్ల ద్వారా వచ్చే నీటిని నింపాలని భావిసున్నారు. ఇదిలావుంటే పాకాల సరస్సు పూర్తిగా నిండి రెండు రోజులుగా మత్తడి పరవళ్లు కొనసాగుతుండటంతో పర్యాటకులతో సందడి నెలకొంది. మూడేళ్ల అనంతరం సరస్సు పూర్తిగా నిండటంతో పర్యాటకుల ఉత్సాహం నీటి పరవళ్లలా ఉరకలు వేస్తోంది. ఉద్యానవనంలోకి అనుమతి లేకపోవడంతో పలువురు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. మత్తడి పోస్తుండటంతో పర్యాటకులు సందడి చేశారు.

# వైరల్ ఫీవర్లతో ఆస్పత్రులు కిటకిట

## టెస్టుల పేరుతో రోగుల జేబులు గుల్ల

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): రకరకాల జ్వరాలతో ఇప్పుడు నగరంలోని ఫీవర్ ఆస్పత్రితో పాటుఅనేక ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతోంది. అధికారులు ఎంతగా ఆదేశాలు ఇచ్చినా ఇక్కడ రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోజూ ఇక్కడికి వచ్చే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. నగరంలో జ్వరపీడితులు పెరుగుతున్నారు. ముఖ్యంగా దోమకాటు కారణంగా వైరల్ జ్వరాలు ఆందోళన కలిగించే స్థాయికి విస్తరిస్తున్నాయి. నగరంలో వైరల్,మలేరియా జ్వరాలు ఉన్నాయని వైద్యులు అంటున్నారు. దీనికితోడు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళితే జేబు గుల్ల తప్పదన్న భయంతో ఎవరు కూడా అటువైపు వెళ్లడం లేదు. దీనికితగ్గట్లుగా ప్రైవేట్ ఆస్పత్రులు ఇప్పుడు వ్యాపార కేంద్రాలుగా మారాయి. రోగి వస్తే చాలు డబ్బు గుంజడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. ఆరోగ్యరక్షణ సంగతి ఎలా ఉన్నా టెస్టుల పేరుతో ఒళ్లు,ఇల్లు గుల్లకాక తప్పడం లేదు. అన్నీ తెలిసినా అధికారులు, పాలనా యంత్రాంగం మిన్న కుంటోంది. జ్వరాలకు సంబంధించి ప్రైవేటు వైద్యశాలలు వసూలు చేస్తున్న ఫీజులపై అనేక ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లు డెంగీ జ్వరాల పేరుతో ప్రజలను బాగా దోచుకుంటున్నాయి. ఇప్పటికీ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు వైద్యం కోసం రావడానికి నానాయాతన పడుతున్నారు. ప్రధానంగా గిరజన ప్రాంతాల్లో సమస్యలు తీవ్రంగా ఉంటున్నాయి. వర్షాకాలంలో వాతావరణ మార్పులతో పాటు జ్వరాలు ప్రబలడం అనివార్యం అవుతోంది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా దోమల నిర్మూలన సాధ్యమవుతుంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా దోమలకు ఎదురులేకుండా పోతోంది. వానాకాలం వచ్చిందంటే మురుగు ద్వారా దోమలు వ్యాప్తి చెందుతాయనే విషయం వైద్యాధికారులకు తెలుసు. అదే సందర్భంలో ప్రైవేట్ ఆస్పత్రులకు కాసుల రాల్చే కాలం ఇది. వ్యాధి ఏదైనా, జ్వరం సోకితే చాలు వివిధ రకాల భయాలను చూసి ప్రైవేట్ ఆస్పత్రులు జలగల్లా పీలుస్తున్నారు. జిల్లాల్లో ఏ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించినా చలితో వణికి పోయే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఇకపోతే గతంలో కేవలం మన్యం,గిరిజన ప్రాంతాల్లోనే విషజ్వరాలు సోకేవి. కానీ ఇప్పుడు దోమలు దాడి చేయకముందే దోమల నివారణ మందు పిచికారి చేస్తే సీజనల్ వ్యాధుల్ని చాలావరకు అరికట్టవచ్చు. మన్యం తరహాలోనే ఇప్పటి కైనా మైదాన ప్రాంత గ్రామాల్లో చైతన్యం కల్పించి ఉరూరా అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహించాల్సి ఉంది. ప్రధానంగా నీటి కాలుష్యం కారణంగా టైఫాయిడ్ జ్వరాలు సోకే ప్రమాదం ఉంటుంది. ముందస్తుగానే తాగునీటి ట్యాంకులు, పైపులైన్ల లీకులు, కలుషిత నీటి సరఫరాను నియంత్రించ గలిగితే టైఫాయిడ్, వైరల్ ఫీవర్ బారి నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, పురపాలక, ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, ఇతర అనుబంధ విభాగాల సమన్వయంతో అధికారులు, సిబ్బంది పనిచేసినపుడే ఇది సాధ్యపడుతుంది. ఇంట్లో, పరిసరాల్లో నీటి నిల్వలు, తాగేసి పడేసిన కొబ్బరిబొండాలు, టైర్లు లేకుండా ఊసుకోవాలి. దోమలు కాల్వల్లో పెరగకుండా ఉండేందుకు మడ్డి ఆయిల్, కిరోసిన్ పోయాలి. ఇంటి కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి పరిసరాల్లో దోమల్ని ఇంట్లోకి రానీయకుండా చేసే మొక్కల్ని పెంచుకోవచ్చు. దోమకారక వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు దోమతెరల్ని వాడటంతో వారంలో ఒక రోజు నిర్మూలనకు అవసరమైన చర్యలు చేపట్టడం ఉత్తమం.

# యాదాద్రి అభివృద్ధికి సానుకూల అంశాలు

## పారిశ్రామిక ప్రగతికి అవకాశాలు మెండు

## యాదాద్రి పూర్తయితే అభివృద్ధి పరుగులు

యాదాద్రి భువనగిరి,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): యాదగిరిగుట్ట లక్ష్మినరసింహస్వామి పేరుతో ఏర్పాటైన యాదాద్రి జిల్లా భువనగిరి కేంద్రంగా మనుగడలోకి వచ్చినా జిల్లా కార్యాలయాలన్నీ త్వరలో గుట్టకు సమీపంలో ఉన్న రాయగిరిలో నిర్మితం కానున్నాయి. ఈ మేరకు స్థల సేకరణ చేసి సమీకృత కలెక్టరేట్‌కు భూమిపూజ చేశారు. అభివృద్ధిలో అన్ని జిల్లాల కంటే ముందుగా దూసుకు పోవడానికి సమీప భవిష్యత్తులో అపార అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వందల కోట్ల రూపాయలతో యాదాద్రి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించింది. దీంతో భవిష్యత్తులో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక నగరిగా అలరారనుంది. రాజధాని హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉండటం ఈ జిల్లాకు సానుకూలాంశంగా మారింది. దీంతో ఇక్కడ పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయి. అలాగే ఆలయ పునర్నిర్మాణంతో యాదాద్రి అద్భుత క్షేత్రంగా అవతరించనుంది. యాదాద్రి పక్కనే దాదాపు 300 ఎకరాల్లో జైనిజానికి సంబంధించిన ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక పరిమళాలతో పాటు హైదరాబాద్ – వరంగల్ పారిశ్రామిక కారిడార్‌తో పారిశ్రామికంగానూ వృద్ధి చెందనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గంధమల్ల చెరువును దాదాపు 10 టీఎంసీల మేర రిజర్వాయర్ నిర్మించడంతో భూగర్భజలాల వృద్ధితో పాటూ వ్యవసాయ రంగం పురోగమించనుంది. జిల్లా కేంద్రం భువనగిరిలో ఏకశిలపై నిర్మించిన కోట, పక్కనే ఉన్న ఆలేరు మండలంలోని కొలనుపాకలో ప్రాచీన జైన దేవాలయం, సమీపంలోని రాజపేట మండలంలోని కోటతో కలిపి ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక వలయంగా చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీంతో పర్యటకుల సంఖ్య పెరిగి ఉపాధి అవకాశాలు కూడా మెరుగవుతాయి. భువనగిరి పట్టణం హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో ఉండటంతో ఇక్కడ 500 ఎకరాల్లో ఒకటి చొప్పున రెండు శాటిలైట్ టౌన్‌షిప్‌లు నిర్మించాలని ప్రభుత్వం గతంలోనే నిర్ణయించింది. పరిశ్రమల ఏర్పాటుకు ఈ నిర్మాణాలు అనువుగా ఉండనున్నాయి. ఇప్పటికే జిల్లాలోని బీబీనగర్, చౌటుప్పల్, భువనగిరి, బొమ్మలరామారం ప్రాంతాలు పారిశ్రామిక కేంద్రాలుగా ఉన్నాయి. ఇక్కడికి సమీపంలోనే పోచంపల్లి చేనేత పరిశ్రమ దేశంలోనే పేరుగాంచింది. ఇక్కడ టెక్స్టైల్ పార్క్ నిర్మించగా..మరో పార్క్ నిర్మాణానికి ఇక్కడ అవకాశముంది. సరైన మార్కెట్ సదుపాయాలు కలిపించి, వారికి కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తే ఉత్పత్తిలో అద్భుతాలు సృష్టించడానికి మెరికల్లాంటి చేనేత కార్మికులు సిద్ధంగా ఉన్నారు. భూతల ఓడరేవులను ఏర్పాటు చేసి వాటి ద్వారా సరకు రవాణా చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు డ్రైపోర్టులను నిర్మించాలని ప్రతిపాదించగా అందులో ఒకటి భువనగిరి కేంద్రంగా నిర్మించాలని ప్రతిపాదించారు. దాదాపు 450 ఎకరాలలో నిర్మించనున్న ఈ రేవులను రైలు, రోడ్డు, విమానయాన, ఓడరేవు సదుపాయాలున్న ప్రాంతాలకు అనుసంధానించనున్నారు. ఓడరేవులో భాగంగా ఇక్కడ కంటెయినర్ల యార్డు, గోదాములు, శీతల గిడ్డంగులు, ఆహార శుద్ధి కేంద్రాలు నిర్మిస్తారు. దీంతో అన్ని రంగాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించనున్నాయి. ఇప్పటి వరకు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న భువనగిరి భద్రత ఇక నుంచి రాచకొండ పోలీస్ కమిషనర్ పరిధిలో ఉంటుంది. మొత్తంగా యాదాద్రి అభిశృద్ధికి అవకాశాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. అన్ని అవకాశాలను వినియోగించుకుంటామని ఆలేరు ఎమ్మెల్యే గొంగడి సునీత అన్నారు.

# మారుతున్న హుజూర్‌నగర్ రంగు

## సిపిఐ తిరకాసుతో కాంగ్రెస్‌కు నష్టం

## టిజెఎస్ మద్దతు ఇచ్చినా కష్టమే

## టిఆర్ఎస్‌కు అనుకూలంగా పరిస్థితులు

హైదరాబాద్/నల్లగొండ, అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): హుజూర్ నగర్ ఉపఎన్నికల్లో రంగు మారుతోంది. పొత్తులు చిత్తయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం ఎవరికి వారే యమునాతీరే అన్న చందంగా సాగుతున్నారు. సిపిఐ అనూహ్యంగా అధికార టిఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చి, గత ఎన్నికల్లో కాంగ్రెస్ చేసిన ఎత్తులపై ప్రతీకారం తీర్చుకుంది. ఓ రకంగా ఇది కాంగ్రెస్‌కు అవనిపాతంగా మారనుంది. ఇకపోతే సీపీఎం మద్దతును టీడీపీ కోరింది. మద్దతు వ్యవహారంపై సీపీఎం నేత తమ్మినేని వీరభద్రంతో టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ ఫోన్‌లో మాట్లాడారు. పార్టీలో చర్చించి నిర్ణయం చెబుతామని తమ్మినేని తెలిపారు. తమ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ కావడంతో సీపీఎం బరిలో లేదు. ఇకపోతే హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని టీజేఎస్ నిర్ణయం తీసుకుంది. అలాగే టీఆర్ఎస్ కు సీపీఐ మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. టీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడతా మన్నారు. టీఆర్ఎస్ నిరంకుశ వైఖరిని తెలంగాణ సమాజం ఎండగట్టాలని పేర్కొన్నారు. మొత్తంగా గత ఎన్నికల్లో ఏర్పడ్డ మహాకూటమి ముజూర్‌నగర్ ఉపఎన్నిక దెబ్బకు విచ్ఛిన్నమైంది. కాంగ్రెస్ పెద్దన్న పాత్రలో సీపీఐ, టీజేఎస్, టీడీపీ, తెలంగాణ ఇంటి పార్టీల కలయికగా పురుడు పోసుకుని ఏదాది గడవకముందే బతికి బట్టకట్టలేక పోయింది. ఈ నెల 21న జరగనున్న హుజూర్‌నగర్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉపఎన్నికలో ఎవరికివారుగా వ్యవహరించబోతున్నాయి. అధికార టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా రాజకీయ శక్తులను ఏకం చేయాలనే ఎజెండాతో రూపొందించిన ఈ కూటమి ప్రస్థానం హుజూర్‌నగర్ ఉప ఎన్నికల వేళ ప్రశ్నార్థకంగా మిగిలింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాలను కొత్త మలుపు తిప్పిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో సహకరించుకున్న కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, ఇంటి పార్టీలు తలోదారి పట్టాయి. కాంగ్రెస్, టీడీపీలు తమ అభ్యర్థులను బరిలోకి దించుతున్నాయి. తెలంగాణ ఇంటి పార్టీ స్వతంత్ర అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. సీపీఐ కూడా కూటమి నుంచి జారుకుంది. తాము పోటీ చేయకూడదని ఇప్పటికే నిర్ణయించుకున్న ఆ పార్టీ టీఆర్ఎస్ అభ్యర్థన మేరకు అధికార పక్షాన్ని అక్కున చేర్చుకుంది. టీజేఎస్ నేతలు హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేయడం లేదని చెబుతూనే ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేస్తామంటున్నారు. కాంగ్రెస్‌కు మద్దతిస్తామని కోదండరామ్ ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిలో పెద్దన్న పాత్ర పోషించిన కాంగ్రెస్ ఆ తర్వాత ఇతర పక్షాలను పట్టించుకోలేదు. ఎన్నికలకు ముందు కూడా కాంగ్రెస్ వ్యవహరించిన తీరు పట్ల భాగస్వామ్యపక్షాలు గుర్రుగానే ఉండేవి. ఆ తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీలు మొక్కుబడిగా మద్దతు ఇచ్చి పుచ్చుకున్నాయి. దీంతో ఇప్పటివరకు పేరుకు మాత్రమే కూటమిగా ఉన్న ఆ పార్టీల అనైక్యత హుజూర్‌నగర్ ఉప ఎన్నికలతో తేటతెల్లమైంది. దీంతో హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. అన్ని పార్టీల సహకారంతో గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 7,500 పైచిలుకు మెజార్టీతో గ్టటెక్కారు. ఇప్పుడు ఒంటరిగా మిగిలిపోయిన నేపథ్యంలో దాని ప్రభావం ఎలా ఉంటుందనేది హాట్‌టాపిక్‌గా మారింది. మొత్తం మీద కూటమి చీలిక కాంగ్రెస్‌ను కష్టాలపాలు చేస్తుందా..? మారిన రాజకీయ పరిస్థితుల్లో టీఆర్ఎస్‌కు ఏమైనా నష్టం చేస్తుందా అన్నది ఫలితం తేల్చనుంది. ఇకపోతే హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో గులాబీ జెండాను ఎగరేయాలని సీఎం కేసీఆర్ మంత్రులకు పిలుపునిచ్చారు. అక్కడ కాంగ్రెస్‌కు బలం లేదని, గతంలో దానిని నమ్ముకున్న పార్టీలు ఇప్పుడు దూరమయ్యాయని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలిచి మిడిసిపడుతున్న బీజేపీకి హుజూర్‌నగర్‌లో గాలి పోవడం ఖాయమన్నారు. . బీజేపీకి అక్కడ డిపాజిట్ కూడా దక్కదన్నారు. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో హుజూర్‌నగర్ ఎన్నికపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం సీపీఐ కూడా టీఆర్ఎస్‌కే మద్దతిస్తున్నందున గెలిచి తీరాలని చెప్పారు. ఇందుకు మంత్రులు ప్రచార బాధ్యతలను భుజాని కెత్తుకోవాలని, కేటీఆర్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వెన్నంటి ఉన్న పార్టీలు ఇప్పుడు లేవని కేసీఆర్ అన్నారు

# పండగవేళ స్వచ్ఛతా ప్రమాణం చేయాలి

## వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

## అనారోగ్య పరిస్థితులకు దూరంగా ఉండాలి

హైదరాబాద్,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకంటేనే మనం ఆరోగ్యంగా ఉండగలమని గుర్తించాలని వైద్యులు సూచిసున్నారు. ఇష్టం వచ్చినట్లుగా చెత్తాచెదారాన్ని రోడ్లపై వేయడం ద్వారా వ్యాధులను కొని తెచ్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పండగవేళలో చెత్తాచెదారన్ని వీధుల్లో వేసే పద్ధతికి స్వస్తి చెప్పాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, ఇందుకు చిన్నాపెద్దా తేడా లేకుండా ముందుకు కదిలితేనే ఇది సాధ్యం అవుతుం దన్నారు. బాపూ జయంతి సందర్భంగా పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో వక్తుల ఇదే అంశాన్ని ప్రస్తావించారు. ప్రధానంగా ప్రజలు చైతన్యవంతులు కావాలి. ఇంకా చెత్త తీసి బయటవేసే పద్ధతిని మానుకోవాలి. పండగ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కోసం ప్రతిన చేయాలి. తమ ఇళ్లలో పోగైన చెత్తను బజార్లో వేసే పాత పద్ధతికి పాతర వేయాలని అన్నారు. దీంతో మనతో పాటు దేశం కూడా ఆరోగ్యంగా ఉంటుందని పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి పిలుపునిచ్చారు. సెలబ్రిటీలు వచ్చి రోడ్లు ఊడ్వడం కేవలం ప్రజలను చైతన్యం చేయడానికి అని గుర్తుంచుకోవాలి. ప్రజలు ఏ విషయంలో అజాగ్రత్తగా ఉన్నా స్వచ్ఛత విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇది మోడీదో లేక, యూపి సిఎం యోగిదో లేక కెసిఆర్ లేదా మరెవరిదో కాదు. వారు ఆరోగ్యకరమైన పరిసరాల్లోనే ఉంటున్నారు. ప్రజలుగా మనమే అనారోగ్యకర వాతావరణంలో ఉంటూ మరింత కంపు తయారుచేస్తున్నామని అన్నారు. ఎవరో వచ్చి చెత్తను తొలగిస్తారనే భ్రమల నుంచి బయట పడాలి. చెత్తను వేయకుండా ఉంటే స్వచ్ఛతను పాటించినట్లే అని గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా మహిళలు తమ భర్తలకు పిల్లలకు స్వచ్ఛత గురించి తెలియచేయాలి. ఇంటినుంచే ఇది మొదల వ్వాలనారు. లేకుంటే అనారోగ్యంతో మన జీవితాలను మనమే బలితీసుకున్న వారం అవుతాం. ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలి. జిఎస్టీ,ఆదాయపన్ను, ఎసిబి లాంటి వాటికన్నా కఠినమైన చట్టాలతో చెత్త దులిపే కార్యక్రమాలు చేయాలి. లేకుంటే రానున్న రోజుల్లో అపరిశుభ్ర దేశాన్ని మన పిల్లలకు అందించిన వారం అవుతామని ఆయన హెచ్చరించారు. స్వచ్ఛభారత్ పేరుతో ప్రచారం చేస్తున్నారే తప్ప ప్రజల్లో అవగాహన పెరగడం లేదు. ప్రభుత్వాలు కూడా దీనిని సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్లాస్టిక్ వినియోగం పెరగడం వల్ల గ్రామాలు కూడా మురికి కూపాలగా మారుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ వాడిపడేసిన ప్లాస్టిక్ వస్తువులు నాలాల్లో దర్శనం ఇస్తున్నాయి. దీంతో కాలువలు శుభ్రంగా లేక చెత్త పేరుకుపోతోంది. దీంతో ఇళ్ల పక్క ఉన్న నీటి గుంతల్లో, సైడుకాల్వల్లో, పారిశుధ్యం లోపించిన ప్రాంతాల్లో, నీరు నిల్వ ఉన్న కుంటల్లో దోమలు వృద్ధి చెందుతున్నాయి. స్వచ్ఛ భారత్‌లో భాగంగా రోడ్లను శుభ్రంగా ఉంచడమే కాక వ్యక్తిగత శుభ్రత, పరిసరాల శుభ్రత ఎంతో ముఖ్యంగా ప్రజలు గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా వారుకూడా తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. మన్యం, మైదాన ప్రాంతం అన్న తేడా లేకుండా వ్యాధులు ముప్పేట దాడిచేయడం ఏటా సర్వసాధారణమైంది. పారిశుధ్య లోపమే దీనికి ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. పల్లెలు, పట్టణాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు కాలువలు అస్తవ్యస్తమయ్యాయి. దీంతో ఏటా వర్షాకాలంతో పాటే అంటురోగాలు కూడా జంటగా కలసి వస్తున్నా ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. ప్రజలు కూడా ఇది తమ తప్పిదమే అని గుర్తించడం లేదు. మరోవైపు స్వచ్ఛభారత్ నినాదంగా మారిందే తప్ప విధానంగా అమలు కావడం లేదు. చెత్త నిర్మూలనకు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు అరుదు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందని వైద్యులు పేర్కొంటున్నారు. కేవలం పారిశుధ్యలోపం కారణంగా విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. పారిశుధ్యం, దోమలే ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. గ్రామాలు,అటవీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు వైరల్ జ్వరాలతో వణుకు తున్నారు. విష జ్వరాలతో బాధపడేవారు ప్రయివేటు ఆస్పత్రుల్లో చేరి వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. దోమలను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. దీనికి ప్రజల తోడ్పాటు లేకపోవడం వల్ల గ్రామాల్లో పారిశుద్యం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది. కంటి తుడుపు పారిశుధ్య చర్యల నేపథ్యంలో విషజ్వరాలతో మృతి చెందుతున్న సంఘటనలు ప్రజలను కలవర పరుస్తున్నాయి. మురుగు నివారణకు బ్లీచింగ్ పొడి చల్లడంతోపాటు సమస్యాత్మక గ్రామాల్లో ఫాగింగ్ చేయడం సర్వసాధారణం. ప్రస్తుతం దోమలు బెడద పెరిగినా ఆ దిశగా నగరాల్లో, పట్టణాల్లో, నగర పంచాయతీల్లో ఫాగింగ్ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిస్తున్నాయి. వర్షాకాలంలో చినుకు పడితే దోమలకు ప్రాణం లేచి వస్తుంది. ఇవన్నీ మనకళ్ల ముందు కనిపిస్తున్న సత్యాలు అయినా ప్రజల్లో చైతన్యం రావడం లేదు. పాలకులను నిత్యం ఆడిపోసుకునే బదులు ప్రజలుగా మనమంతా పారిశద్య పాలన ఇంటినుంచే మొదలు పెట్టాలన్నారు. ఎవరో వస్తారని..ఏదో చూస్తారని ఎదురుచూడకుండా ముందుకు సాగాలి. అప్పుడే స్వచ్ఛ గ్రామాలు, వార్డులు నిర్మించుకున్న వారం అవుతామన్నారు.

# మన్యంలో వైద్యసేవలు విస్తృతం

కొత్తగూడెం,అక్టోబర్3 (ఆంఎన్ఎ): మన్యంలో జ్వరాల తీవ్రత బాగా తగ్గడానికి చర్యలు తీసుకోవడంతో ఈ ఏడాది మన్యంలో మలేరియా జ్వరాల సంఖ్య బాగా తగ్గింది. గోదావరిలో వరద పెరగడంతో మన్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం భద్రాద్రి జిల్లా ఐటీడీఏపరిధిలో 29 పీహెచ్‌సీలు ఉన్నాయి. గతంలో గుర్తించిన 658 సమస్యాత్మక ఆవాసాలు మన్యంలోనివే. ఈ ప్రాంతంలో దోమల తీవ్రత ఉండటం వల్ల మలేరియా, డెంగీ, గన్యా వంటి వ్యాధులు ప్రబలుతున్నట్లు గుర్తించారు. ఈ గ్రామాల్లో ప్రతీచోట పిచికారి చేయడంతోపాటు నిరంతర పర్యవేక్షణ పెంచారు. తరచూ మలేరియా విభాగంపై సమీక్ష చేయడంతో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తమయ్యారు. రెండు జిల్లాల్లో కలిపి ఉన్న ఆవాసాల్లో దోమల మందును పిచికారి చేస్తేనే దోమల ఉనికిని పూర్తిగా నాశనం చేసేందుకు వీలవుతుంది. మైదానం ప్రాంతంలోని కొన్ని మండలాల్లో దోమకాటు కేసులు తక్కువ ఉన్నాయన్న ఉద్దేశంతో గతంలో కొంత నిర్లక్ష్యం వహించారు. మన్యంలో ఐటీడీఏ సహకారంతో చర్యలు తీసుకుంటున్నారు.

# నిముషంలో ఆరు ఇడ్లీలు హాంఫట్

## మైసూరు ఉత్సవాల్లో బహుమతి గెలిచిన బామ్మ

బెంగళూరు,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): సాధారణంగా ఎవరైనా నాలుగైదు ఇడ్లీలు తినగలరు. మహా అయితే మరో ఒకటో రెండో అది కూడా నంజుకోవడానికి చట్నీ, సాంబార్ లాంటివి ఉంటే తీరిగ్గా ఆరగించగలరు. అయితే.. ఒక 60 ఏళ్ల వృద్ధురాలు నిమిషంలో ఆరు ఇడ్లీలు గుటుక్కు మనిపించి ఇడ్లీ తినే పోటీలో విజేతగా నిలిచింది. మైసూరు దసరా ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఇక్కడ ఇడ్లీ తినే పోటీని నిర్వహించారు. మహిళలకు మాత్రమే జరిగిన ఈ పోటీలో నిమిషంలో ఎవరు ఎక్కువ ఇడ్లీలు తింటే వారే విజేతగా నిలుస్తారని నిర్వాహకులు ప్రకటించారు. కర్నాటలోని హుళ్లహళ్లికి చెందిన సరోజమ్మ అనే వృద్ధురాలు నిమిషంలో ఆరు ఇడ్లీలు తిని ప్రథమ బహుమతి కొట్టేసింది. మైసూరు దసరా ఉత్సవాలను 10 రోజుల పాటు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మైసూరు ప్యాలెస్‌ను 10వేల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఏటా ఉత్సవాల్లో పాల్గొనడానికి వేలాదిగా ప్రజలు తరలివస్తారు.

# కట్కూరులో భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం

సిద్దిపేట,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): సిద్దిపేట జిల్లాలోని అక్కన్నపేట మండలం కట్కూరులో భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లారీలో తరలిస్తున్న 360 బ్యాగుల అమ్మోనియం నైట్రేట్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. అమ్మోనియం నైట్రేట్‌ను కర్ణాటక నుంచి రాజస్థాన్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## ఏపీ వార్తలు

# ఎస్సీ, ఎస్టీలపై దాడులపై కఠిన చర్యలేవీ?

### మభ్యపెట్టే చర్యలతో ఎంతకాలం గడుపుతారు

అమరావతి,అక్టోబర్3 (ఆం ఎన్ఎ): దళితులు, గిరిజనుల జీవనోపాధిపై, హక్కులపై, ఐక్యతపై, రాజ్యాంగ హక్కులపై పాలక పక్షాలు సాగిస్తున్న దాడి శ్రామిక ప్రజల ముందున్న అత్యంత తీవ్రమైన సవాలు. దళితులకు, గిరిజనులకు కాస్తో కూస్తో రక్షణ కల్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు సాగుతున్న కుట్రలకు అడ్డుకట్ట వేయాలి. అటవీ సంపదపై వారికున్న హక్కులు హరించి వేయబడుతున్నాయి. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ సర్వం ప్రయివేటుకు సమర్పించే విధానాల వల్ల రిజర్వేషన్లు ఉన్నా కూడా ఉపాధి పొందలేని దుస్థితిలో విలవిలాడుతున్నారు. సహజసిద్ధంగానూ, రాజ్యాంగబద్ధంగానూ లభించిన హక్కులు హరించుకుని పోయే దుస్థితులు దాపురించాయి. దాడులు నిత్యం కృత్యమై దళితులు, గిరిజనుల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందన్న ఆందోళనలు పెరిగాయి. ప్రతిరోజు మహిళలు దేశంలో ఎక్కడో ఒక చోట అత్యాచారానికి గురౌతున్నారు. దళితుల విషయంలో టిడిపి ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలు ఉన్నాయి. బట్టి అర్థం చేసుకోవచ్చు. దళితులపైనా, గిరిజనులపైనా దాడులను ఉపేక్షిస్తూనే రాజకీయ ప్రయోజనాల కోసం వారిని ప్రలోభ పెట్టేందుకు అధికార టిడిపి, రాష్ట్రంలోని ప్రతిపక్ష వైసిపి పోటాపోటీగా ప్రయత్నిస్తున్నాయి. ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటుపరం చేస్తూ ఒకవైపు ఉన్న ఉపాధి భద్రతను విచ్ఛిన్నం చేస్తున్న పాలకులు నిరుద్యోగాన్ని పెంచేస్తున్నారు. దళిత, గిరిజనుల పరిస్థితులను మెరుగుపరచాలని ఏ ప్రభుత్వమైనా తీవ్రంగా ప్రయత్నించదలిస్తే చేయాల్సింది అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడం మాత్రమే కాదు. సమానత్వాన్ని కల్పించే రాజ్యాంగ, న్యాయపరమైన హక్కులను సమర్థవంతంగా అమలు చేసేందుకు హామీ ఇవ్వాలి. అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి వారికి భూహక్కులు బదలాయించాలి. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టాన్ని రాజ్యాంగ తొమ్మిదో షెడ్యూలులో చేర్చి రక్షణ కల్పించాలి.

# తిరుమల బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతి కార్యక్రమాలు

### ఆకట్టుకున్న ధార్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు

తిరుమల,అక్టోబర్3 (ఆం ఎన్ఎ): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలలో సాంస్కృతిక కార్యక్రమాలుప్రత్యేక ఆకర్శణగా నిలుస్తున్నాయి. ప్రతి రోజూ ఉదయం సాయంత్రం ఈ కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇకపోతే మాడవీధుల్లో కూడా భక్తి కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి.

ని నాదనీరాజనం వేదికపై ధార్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు, శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో తిరుమలలోని నాదనీరాజనం వేదిక, ఆస్థానమండపంలో ధార్మిక, ఆధ్యాత్మిక, భక్తి సంగీత కారక్రమాలు ఏర్పాటుచేశారు.ఇందులో భాగంగా నాదనీరాజనం వేదికపై శ్రీమతి బి.లక్ష్మీసువర్ణ బృందం మంగళధ్వని, తిరుమల ధర్మగిరి వేదపాఠశాల విద్యార్థులు చతుర్వేద పారాయణం నిర్వహించారు. తిరుపతికి చెందిన శ్రీమతి కెవి.లక్ష్మి బృందం విష్ణుసహస్రనామ పారాయణం, విజయవాడకు చెందిన శ్రీ జి.మోహనాచార్యులు ధార్మికోపన్యాసం చేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ రామాచారి బృందం అన్నమయ్య విన్నపాలు, సాయంత్రం కుంభకోణానికి చెందిన శ్రీ ఆర్.షణ్ముగం బృందం నామసంకీర్తన, ఊంజల్‌సేవలో పుణెకి చెందిన శ్రీమతి పి.నందినీరావు బృందం అన్నమాచార్య సంకీర్తనలను వీనులవిందుగా గానం చేశారు. రాత్రి తిరుపతికి చెందిన శ్రీ ఎం.రామడు భాగవతార్ హరికథ పారాయణం చేశారు.అదేవిధంగా, తిరుమలలోని ఆస్థానమండపంలో విజయవాడకు చెందిన శ్రీ విశ్వనాథ్ బృందం భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు.

# వైభవోపేతంగా తిరుమల బ్రహ్మోత్సవాలు

### నారసింహునిరూపంలో దర్శనమిచ్చిన స్వామి
### సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయప్రదానం
### ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తిరుమల,అక్టోబర్3 (ఆర్ ఎన్ఎ): తిరుమల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం సింహవాహనంపై ఊరేగిన శ్రీవారు.

వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు ఉదయం అనంతతేజోమూర్తి అయిన శ్రీ మలయప్పస్వామి యోగ నరసింహుని అవతారంలో సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు భజనలు, కోలాటలు, జియ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక బృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పలువురు వివిధ ఘట్టాలను ప్రదర్శించారు. స్రీవారు మూడోరోజు ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సింహంపై కూర్చొని ఊరేగుతారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. ఉదయం నిద్ర లేవగానే దర్శించే వస్తువుల్లో 'సింహదర్శనం' అతి ముఖ్యమయింది. సింహ రూప దర్శనంతో పైన పేర్కొన్న శక్తులన్నీ చైతన్యవంతమవుతాయి. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను, నా వాహనమైన సింహమూ సమాన ప్రయత్నంతో ఉంటామని ఈ సింహ వాహనోత్సవం ద్వారా శ్రీవారు నిరూపించారు.

ముత్యాల నిర్మలకాంతులు వ్యాపించడానికి, ఆ కాంతులు దర్శించి భక్తులు ముక్తులు కావడానికి రాత్రి వేళ అనుకూలం. అందుకే శ్రీమలయప్పకి మూడో రోజు రాత్రి మొదటియామంలో ముత్యాల పందిరిలో కూర్చొని విహరించే కైంకర్యాన్ని పెద్దలు నిర్ణయించారు. ముత్యం స్వచ్ఛతకు సంకేతం. మనిషి ఆత్మ ఎన్నో జన్మల అనంతరం విశ్వలోకాల నుండి రాలి, దుర్లభమైన మానవజన్మను సంతరించుకుంటుంది. శరీరాన్ని ఆధ్యాత్మిక సంపదతో శుద్ధి చేసుకుంటే బుద్ధి ముత్యంలాగా మారి, జనన, మరణ చక్రం నుండి విడుదలై మోక్షాన్ని పొందుతుంది. ఇలా స్వామివారికి మిక్కిలి ప్రీతిపాత్రమైన ముత్యాలహారాలు - రత్నాల వల్ల కలిగే వేడిమినీ, పుష్పాల వల్ల కలిగే సుగంధాన్ని తమలో ఇముడ్చుకుని, స్వామివారి వక్షఃస్థలానికి, అక్కడి లక్ష్మీదేవికి సమశీతోష్ణస్థితిని చేకూరుస్తూ, తాపగుణాన్ని హరిస్తూ, ఉత్సాహాన్ని, ప్రశాంతతను చేకూరుస్తున్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ఎ వి. ధర్మారెడ్డి, తిరుపతి జెఈవో పి.బసంత్‌కుమార్, సివిఎస్వో గోపినాథ్‌జెట్టి, ఎస్వీబీసీ ఛైర్మన్ పృధ్వీరాజ్, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాలలో నాలుగో రోజైన గురువారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనంపై శ్రీవారు ఊరేగి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

# సమరయోధులకు సన్మానం ఆనందాయకం

### గాంధీ మార్గమే ఎల్లవేళలా అనుసరణీయం: గవర్నర్

విజయవాడ,అక్టోబర్3 (ఆర్ ఎన్ఎ): గాంధీజయంతి సందర్భంగా స్వతంత్ర్య సమరయోధులకు సన్మానం చేయడం సంతోషమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భావి భారత నిర్ణేతలని గాంధీజీ అన్నారని గుర్తు చేశారు. యువతకు గాంధీజీ ఇచ్చిన సందేశాలు కాలంతో సంబంధం లేకుండా సమకాలీనమేనని కొనియాడారు. గాంధీజీ ఆలోచనలు, విధానాలు ఉపాధ్యాయులకు చాలా ఉపయోగపడతాయని చెప్పారు. సత్యమేవ జయతే అని మహాత్ముడు చెప్పాని, అహింస, సత్యం మాట్లాడటం గాంధీజీ నేర్పిన అంశాలని అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మర్చిపోలేనివని, తెలుగు తనకు అర్థం కాకపోయినా, విద్యార్థుల మాటల్ని వారి ఉద్వేగం నుంచి అర్థం చేసుకున్నానని పేర్కొన్నారు

# జ్వరాలపై ఏపి సర్కార్ అప్రమత్తం

### ప్రజలు స్వచ్ఛత పాటించాలన్న మంత్రి

అమరావతి, అక్టోబర్ 3 (ఆర్ఎన్ఎ): అంటువ్యాధులు సోకకుండా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్లనాని అన్నారు. పారిశుద్యం విషయంలో ప్రజలు కూడా బాధ్యతగా ఉన్నప్పుడే వ్యాధుల నివారణ సాధ్యమని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలని అన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే సమస్యలు రావన్నారు. విషజ్వరాలు లేదా మలేరియా లాంటి జ్వరాలు వస్తే తక్షణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు, మందులు అందుబాటులో ఉంచామని, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే సాయం అందేలా చూస్తున్నామని అన్నారు. ఈ తరహా కేసుల్లో ఆస్పత్రుల దోపిడీపై ఫిర్యాదులు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు ఏవైనా విధిగా డెంగీ జ్వరాలకు సంబంధించి పాజిటివ్ అని తేలితే ఆ వివరాలను తెలియజేయాలని సూచించారు. గతేడాది డెంగ్యూ జ్వరాలు ఎక్కువగా ప్రబలినందున చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల దృష్ట్యా మరోవైపు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులను కూడా అప్రమత్తం చేశారు. వారి పరిధిలో ఉన్న అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న రోగులు.. వారికి అందిస్తున్న వైద్య పరీక్షలకు సంబంధించిన వివరాలు సేకరించేలా చేశారు. అవసరమైన వైద్యనిపుణులు, పారామెడికల్

సిబ్బంది, ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులో పెట్టుకుని కేవలం 12 గంటల్లోపే పరీక్షలు పూర్తి చేసి వాటి వివరాలను వైద్యశాలలకు తెలియజేస్తున్నారు.

# ఆకస్మిక తనిఖీలుచేసిన మంత్రులు

ఖమ్మం, అక్టోబర్3:ఖమ్మం, జిల్లా వర్యటనలో భాగంగా ఏన్కూరు వెళ్తున్న మంత్రులు మార్గమధ్యలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

గుబ్బగుర్తి గ్రామం మీదగా వెళ్తున్న క్రమంలో పారిశుధ్య లోపాన్ని గమనించిన మంత్రులు

ఎర్రబెల్లి దయాకర్ రావు , పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు.. సంబంధిత వ్యక్తులకు జరిమానా విధించారు. గుబ్బగుర్తి గ్రామంలో రోడ్డుపై చెత్త వేసిన బండి శ్రీరాములు అనే దుకాణదారునికి 5 వేల రూపాయల ఫైన్ వేశారు. ఏన్కూరు గ్రామంలో మెయిన్ రోడ్ లోని దుకాణం ముందు చెత్త కుప్ప వేసిన వెంకట కృష్ణ ట్రేడర్స్ యజమానికి రూ.5 వేలు, పరిసరాలను అపరిశుభ్రంగా మార్చిన ఎస్సార్ పెట్రోల్ బంక్ యజమానికి రూ.5 లక్షల ఫైన్ వేశారు.

# దంపతులను బెదరించి దోపిడీ

రంగారెడ్డి,అక్టోబర్3 (ఆర్ ఎన్ఎ): శంషాబాద్ మండలం చౌదరిగూడెంలో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఓ ఇంట్లోకి చొరబడిన దొంగలు.. దంపతలను కత్తులతో బెదిరించారు.

ఇంట్లో ఉన్న వెండి, బంగారు ఆభరణాలు, నగదును దొంగలు ఎత్తుకెళ్లారు.

3.5 తులాల బంగారం, 45 తులాల వెండి, రూ. 1.2 లక్షల నగదును దోచుకెళ్లినట్లు బాధిత దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దొంగల కోసం గాలిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

# గ్రామాల స్వచ్ఛతే మహాత్ముడికి నివాళి: ఎర్రబెల్లి

ఖమ్మం,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): గ్రామాల స్వచ్ఛతను సాధించడం ద్వారానే మహాత్ముడికి సరైననివాళి అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుఅన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన విధి అన్నారు. గాందీ జయంతిని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఖమ్మం గాంధీ చౌక్‌లో జరిగిన ఈ వేడుకల్లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్, ఎంపీ నామా నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ముగ్గురు మంత్రులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఖమ్మంలోని తెరాస నేత వద్దిరాజు రవిచంద్ర నివాసంలో తేనీటి విందులో మంత్రులు పాల్గొన్నారు.

# గాంధీ అహింసా మార్గం నేటికి అనుసరణీయం

### ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా జయంతి



నిర్మల్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): జాతిపిత మహాత్మగాంధీ 150 జయంత్యుత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. నిర్మల్‌లోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సి. శశిధర్ రాజు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాపూ చూపిన సత్యం, అహింసా మార్గాలు భావితరాలకు బాసటగా నిలిచాయన్నారు. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమాన్ని శాంతియుతంగా నిర్వహించి విజయవంతమయ్యారని ఎస్పీ తెలిపారు. శాంతి పోరాటంతోనే గాంధీ బ్రిటీషర్లను గడగడలాడించాడనీ, దానికి ప్రతిఫలమే నేటి స్వాతంత్యం÷-ర అని ఆయన తెలిపారు. ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ.. తాను నమ్మిన సిద్దాంతాలను ఆచరించి దేశంలోనే కాకుండా ప్రపంచం లోనే తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. స్వాతంత్యానికి పూర్వమే గాంధీ పరిశుభ్రత గురించి, మరుగుదొడ్ల గురించి, స్వచ్ఛత గురించి ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్ రెడ్డి , ఎస్పీ సీసీ వెంకటరమణ, ఆర్ఐ వెంకట్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కను తొలగించినందుకు 30వేల ఫైన్



సిద్దిపేట,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): హరితహారంలో భాగంగా నాటిన మొక్కను తొలగించడంపై సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అనూహ్యమైన రీతిలో స్పందించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కుషాల్ నగర్ ప్రాంతంలో బాలనర్సయ్య అనే వ్యక్తి తన స్థలాన్ని చదును చేస్తూ.. హరితహారం మొక్కను తొలగించడంపై సీరియస్ అయ్యారు. మొక్కను తొలగించిన అతనికి 30 వేల రూపాయల జరిమానాతో పాటు 30 మొక్కలు నాటి వాటిని సంవత్సరం పాటు సంరక్షించాలని ఆదేశించారు. మరెవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కోరారు.

# గ్రామ పాలనలో నూతన శకం

### చాగల్లులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన వనిత

ఏలూరు,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): మన జాతిపిత మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నాంది పలికిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. గ్రామ పాలనలో నూతన శకం ప్రారంభమైందని పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..దేశానికి స్వాతంత్యం తెచ్చిన గాంధీజీ 150వ జయంతి రోజే.. గ్రామ సచివాయాన్ని ప్రారంభించడం దేశ పౌరురాలిగా తనకు గర్వకారణంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన మూడు నెలల కాలంలోనే సుమారుగా యువతకు లక్ష ఉద్యోగాలు కల్పించడం అనేది ఒక చరిత్ర అని, ఇది జగనన్న తీసుకున్న ఒక సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. గత ప్రభుత్వా హయాంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీ అయిన ఉద్యోగాల స్థానంలో మాత్రమే భర్తీ చేయడం అనేది జరిగేది కానీ.. ఇటువంటి సాహసోపేతమైన నిర్ణయం దేశ చరిత్రలోనే కాదు ప్రపంచలోనే మొదటిసారి అని..ఇది ఒక రికార్డు అని తానేటి వనిత హర్షం వ్యక్తం చేశారు. జగనన్న పాదయాత్రలో యువత కష్టాలను చూసి తమ ప్రభుత్వం రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలలో భాగంగానే ఈ నియామకాలు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నియామకాలతో యువతకు చక్కని బంగారు భవిష్యత్తు ఏర్పడిందని చెప్పుకోవచ్చు అన్నారు. మడమతిప్పని... మాట మార్చని జగనన్నపై ఉద్యోగాలు పొందిన యువత, వారి కుటుంబాలు కూడా అభిమానం పెంచుకున్నట్లుగా.. వారి కళ్ళల్లో ఆనందం చూస్తుంటే తెలుస్తోందని మంత్రి అన్నారు.



కరీంనగర్‌లో మహాత్ముడి విగ్రహం వద్ద నివాళి అర్పించిన మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, అక్టోబర్2: గాంధీ జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్ముడి సిద్ధాంతాలకు బిజెపి తిలోదకాలు

## వారి పాలనతో గాంధీ ఆత్మ ఎంతగానో క్షోభిస్తోంది

### ర్యాలీలో సోనియాగాంధీ ప్రసంగం

### ర్యాలీలో ఉత్సాహంనింపిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,అక్టోబర్3 (ఆంఎన్ఎ): కుట్రపూరిత రాజకీయాలు చేసే వారు మహాత్మా గాంధీ సిద్ధాంతాలైన శాంతి, అహింస గురించి ఎన్నటికీ అర్థం చేసుకోలేరని కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. భారత జాతిపిత మహాత్మా గాంధీ 150వ జయంతి సందర్భంగా బుధవారం రాజ్‌ఘాట్ వద్ద సోనియా బాపూజీకి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ... గత ఐదేళ్లుగా దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు గాంధీ ఆత్మ ఎంతగానో క్షోభించి ఉంటుందని మోదీ సర్కారుపై విమర్శలు ఎక్కుపెట్టారు. తమను తాము గొప్పవాళ్లుగా భావించుకునే వ్యక్తులు.. దేశం కోసం గాంధీజీ చేసిన త్యాగాలను ఏనాటికీ అర్థంచేసుకోలేరని విమర్శించారు. 'ఇండియా, గాంధీ పర్యాయపదాలు. అయితే కొంతమంది మాత్రం ఆరెస్సెస్, భారత్ పర్యాయపదాలు అని ప్రచారం చేసే పనిలో పడ్డారు. నయవంచక రాజకీయాలు చేస్తున్నారు. శాంతి, అహింస అన్న మాటలు వాళ్లకు ఎన్నటికీ అర్థం కావు అని బీజేపీ మాతృ సంస్థ ఆరెస్సెస్‌పై సోనియా విమర్శల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా గాంధీ సిద్ధాంతాలను, ఆదర్శాలను ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఆచరించాలని సోనియా విజ్ఞప్తి చేశారు. మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'గాంధీ సందేశ్ యాత్ర'లో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఢిల్లీ రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం రాజీవ్ భవన్ (దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్) నుంచి రాజ్‌ఘాట్ వరకూ బుధవారంనాడు కాంగ్రెస్ పాదయాత్ర నిర్వహించింది. మూడు కిలోమీటర్ల మేర ఈ పాదయాత్ర సాగింది. పాదయాత్రలో రాహుల్ గాంధీ పాల్గొనడంతో వలంటీర్లు, పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం తొంగిచూపింది. జెండాలు ఊపుతూ, నినాదాలు హోరెత్తిస్తూ ఉత్సాహంగా ముందుకు కదిలారు. పలువురు యువకులు గాంధీజీ ట్రేడ్‌మార్క్ అయిన ధోవతి, కళ్లజోళ్లు ధరించి, ఊతకర్రలు పట్టుకుని పాల్గొనడం ఆకట్టుకుంది. కాగా, లక్నోలో జరిగిన 'పాదయాత్ర'కు ప్రియాంక గాంధీ సారథ్యం వహించారు. కాగా కాంగ్రెస్ పార్టీ నేత ప్రియాంక గాంధీ వాద్రా కూడా సోనియాతో పాటు రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ..' సత్యనిష్ఠతో ఉండమని.. సత్యమార్గంలో నడవాలని మహాత్మా గాంధీ బోధించారు. బీజేపీ కూడా బాపూ చెప్పిన బాటలో నడవాల్సిన ఆవశ్యకత ఉంది అని పేర్కొన్నారు. ఇక గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ.. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో లక్నోలో నిర్వహించనున్న పాదయాత్రలో ప్రియాంక గాంధీ పాల్గొననున్నారు.

**సత్యమార్గాన్ని వీడిన బిజెపి: ప్రియాంక**

గాంధీజీ ఆశయాలను తమ సిద్ధాంతాలుగా బీజేపీ తప్పుడు ప్రచారం చేసుకుంటోందని ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. సత్యం, అహింసలను గాంధీజీ బోధించారని, సత్యమార్గాన్ని ముందు అనుసరించి ఆ తర్వాత గాంధీ గురించి బీజేపీ మాట్లాడితే బాగుంటుందని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో బుధవారంనాడు జరిగిన పాదయాత్రలో ప్రియాంక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, వాటిపై గళం విప్పితే దారుణంగా అణిచివేస్తున్నారని అన్నారు. అత్యాచారాలకు వ్యతిరేకంగా తాము కచ్చితంగా పోరాటం చేసి తీరుతామని అన్నారు.

# మతఛాందసవాదుల చేతుల్లో గాంధీ హతం

## గాంధీ జయంతి వేడుకల్లో భట్టి

హైదరాబాద్,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): మత ఛాందస వాదులు గాంధీని పొట్టన పెట్టుకున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీ భవన్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మత ఛాందస వాదులు దేశాన్ని చిన్నాభిన్నం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. గాంధీ చూపిన మార్గాన్ని ప్రపంచ దేశాలు అనుసరిస్తున్నాయని, ఇక్కడి పాలకులు విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భట్టి అన్నారు. పాతబస్తీలో మహాత్మా గాంధీ 150వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చార్మినార్ వద్ద జాతీయ జెండాను కుంతియా ఆవిష్కరించారు. చార్మినార్ నుంచి గాంధీభవన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, షబ్బీర్ అలీ, అంజన్‌కుమార్, పొన్నం ప్రభాకర్, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

**నియంతకు ప్రజాస్వామ్యానికి మధ్య పోటీ**

హుజూర్‌నగర్‌లో నియంతకు, ప్రజాస్వామ్యానికి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారిన కేసీఆర్‌ను ఓడించాలని కోరారు. సీపీఐ నాయకత్వం టీఆర్ఎస్‌తో పోయినా.. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి కార్యకర్తలు కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ మునిగిపోయే నావ అయితే కేటీఆర్‌కు భయమెందుకు?, టీఆర్ఎస్‌కు భయం పట్టుకుంది కాబట్టే... మండలానికి మంత్రిని, గ్రామానికో ఎమ్మెల్యేను పెట్టారన్నారు. అంతర్యుద్ధంతో టీఆర్ఎస్ మునిగిపోవడం ఖాయమన్నారు. హుజూర్‌నగర్‌లో డబ్బు సంచులతో టీఆర్ఎస్ గెలవానుకుంటోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆరోపించారు. ఓటమి భయంతో ఇతర పార్టీల నేతలను కలుస్తున్నారన్నారు. ఉత్తమ్ చేసిన అభివృద్ధి పనులే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

# సమస్యలపై కార్మికులతో కమిటీ చర్చలు

## పండగ ముందు సమ్మెవద్దన్న త్రిసభ్య కమిటీ

## చర్చలు విఫలంకావడంతో సమ్మె సాగుతుందన్న సంఘాలు

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ):ఆర్టీసీ కార్మిక సంఘాలతో సోమేష్‌కుమార్ కమిటీ చర్చలు విఫలమయ్యాయి. ఈనెల 5 నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉంటుందని కార్మిక సంఘాలు ప్రకటించాయి. ప్రభుత్వం నుంచి సరైన హామీ రాలేదని తెలిపాయి. కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చాయి. ప్రభుత్వం ఎ÷-లాన్ బీ రెడీ చేసినా సమ్మె మాత్రం ఆగదని హెచ్చరించాయి. ఆర్టీసీ కార్మికులు అందరూ ఏకతాటిపైకి రావాలని కోరాయి. ఆర్టీసీ అధికారులతో, కార్మికులతో చర్చించినట్లు సోమేష్‌కుమార్ తెలిపారు. దసరా పండుగ దృష్ట్యా సమ్మెను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల 26 డిమాండ్లపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. గడువు కావాలని ఆర్టీసీ కార్మిక సంఘాలను కోరినట్లు వెల్లడించారు. సమ్మెపై ప్లాన్-ఎ, ప్లాన్-బి రెడీగా ఉన్నాయని స్పష్టం చేశారు. అయితే ప్రజలంతా దసరా సెలవులకు ఇంటికి వెళుతూపండుగ జరుపుకునే వేళ ఆర్టీసీ సమ్మెసరికాదని ప్రభుత్వం నియమించిన కమిటీ సూచించింది. ఈ నెల 5వ తేదీ నుంచి సమ్మె చేపట్టాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు పిలుపునివ్వడంతో.. వారి సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సోమేశ్ కుమార్, రామకృష్ణారావు, సునీల్ శర్మతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బుధవారం ఆర్టీసీ జేఏసీ నేతలతో త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. సమావేశం ముగిసిన అనంతరం సోమేశ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై చర్చించామని తెలిపారు. దసరా పండుగ ముందు సమ్మె వద్దని ఆర్టీసీ జేఏసీకి విజ్ఞప్తి చేశామన్నారు. ఆర్టీసీ సమస్యలను సమూలంగా పరిష్కరించేందుకే యత్నిస్తున్నాం. ముందుగా తక్షణం పరిష్కారమయ్యే అంశాలపై చర్చించాం. తర్వాత దీర్ఘకాలిక పరిష్కార మార్గాలపై చర్చించాం. ఆర్టీసీపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారని సోమేశ్ కుమార్ పేర్కొన్నారు. ఆర్టీసీ జేఏసీ లేవనెత్తిన 26 అంశాలపై చర్చిస్తాం. ఆర్టీసీ పరిరక్షణపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. 26 డిమాండ్లను పరిశీలించి సమగ్ర నివేదిక ఇస్తాం. ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు సమయం పడుతుందని సోమేశ్ కుమార్ స్పష్టం చేశారు.

# ముంబై బీచ్‌లో స్వచ్ఛ భారత్

## చెత్తా చెదారం తొలగించిన విద్యార్థులు

ముంబై,అక్టోబర్3 (ఆంఎన్ఎ):గాంధీ జయంతి సందర్భంగా ముంబై వెర్సొవా బీచ్‌లో వందలాదిమంది విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. బీచ్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని విద్యార్థులు తొలగించి శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు పర్యావరణవేత్త అఫ్రోజ్ షా పాల్గొన్నారు. నాటి గాంధీజీ కలను సాకారం చేసేందుకు తాము ప్రతీ వారంలో ఒకరోజు బీచ్ తోపాటు పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నామని అఫ్రోజ్ షా చెప్పారు. గాంధీజీ చూపించిన మార్గంలో పయనిస్తూ దేశాన్ని ప్రేమించండి అంటూ జైహింద్ హై మహారాష్ట్ర అంటూ నినాదాలు చేశారు.

# విమానంపై గాంధీజీ చిత్రం..ఎయిరిండియా నివాళి

న్యూఢిల్లీ, అక్టోబర్3: ఎయిర్‌ఇండియా మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిర్‌బస్ ఏ-320 విమానంపై గాంధీజీ ఫొటోను చిత్రించి నివాళులు అర్పించింది. విమానం తోక భాగంలో 11 అడుగుల ఎత్తు 5 అడుగుల వెడల్పుతో గాంధీజీ చిత్రాన్ని వేశాం. తొలిసారి ఇలాంటి ప్రయత్నం చేశాం. దేశ ప్రజలకు గాంధీజీ చేసిన సేవలు, ఆయన అందించిన సందేశాన్ని చేరవేయాలనే ఉద్దేశంతో విమానంపై ఆయన చిత్రపటాన్ని పెయింటింగ్ వేసినట్లు ఎయిరిండియా సీఎండీ అశ్వనీ లోహని తెలిపారు.

## ఏపీ వార్తలు

# గ్రామసచివాలయాలతో ప్రజల ముగింటకు పాలన

### సచివాలయ ఉద్యోగులందరికీ స్మార్ట్‌ఫోన్‌లు

### ప్రభుత్వ పథకాలు డోర్ డెలివరీ చేయిస్తా

### అవినీతికి పాల్పడితే ఫోన్ చేయండి

### కురవలో గ్రామ సచివాలయం ప్రారంభించిన సిఎం జగన్

కాకినాడ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): గ్రామ సచివాలయాల ద్వారా జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం నెరవేరుతోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి రోజున ఆయన సేవలను స్మరించుకోవాలన్నారు. అవినీతిరహిత పాలనే లక్ష్యంగా చేసిన గొప్ప ప్రయత్నమే సచివాలయ వ్యవస్థ అని సీఎం స్పష్టం చేశారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రతి గ్రామంలో 10శాశ్వత ఉద్యోగాలు కల్పించామన్నారు. ప్రతి రెండువేల మంది జనాభాకు ఒక సచివాలయంను ఏర్పాటు చేసినట్లు సీఎం వివరించారు. సచివాలయ ఉద్యోగులందరికీ స్మార్ట్‌ఫోన్‌లు అందిస్తామని సీఎం ప్రకటించారు. అలాగే ప్రతి 50 ఇళ్లకు అదనంగా ఒక వాలంటీర్‌ను నియమించామన్నారు .ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయాన్ని ప్రవేశపెట్టింది. అంతకు ముందు ముఖ్యమంత్రి గ్రామ సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగించారు. ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే 4 లక్షల ఉద్యోగాలు కల్పించిన చరిత్ర దేశంలో ఎక్కడా లేదు. 1,34,978 మందికి శాశ్వత ఉద్యోగాల కల్పన రికార్డ్. ఇకపై గ్రామల్లోనే 500కుపైగా ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రానున్నాయి. 2020 జనవరి 1 నాటికి గ్రామ సచివాలయాల్లో పూర్తి సేవలు అందుబాటులోకి రానున్నాయి. వీటి ద్వారానే రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందిస్తాం. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దడమే మా లక్ష్యం. ప్రభుత్వ పథకాలను, పాలనను ప్రతి గడపకు తీసుకెళ్లడం మా ధ్యేయం. గ్రామాల్లో పాలన చాలా అధ్వానంగా ఉంది. గత ప్రభుత్వంలో లంచాలు ఇవ్వనిదే పని జరిగేది కాదు. అలాంటి వ్యవస్థను శాశ్వతంగా రూపుమాపడమే సచివాలయాల కర్తవ్యం అని వివరించారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా సచివాలయ ఉద్యోగుల నియామకం చేపట్టామని అన్నారు. సచివాలయ ఉద్యోగులకు అనుసంధానంగా గ్రామ వాలంటీర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామ సచివాలయాల ద్వారా 500రకాల సేవలు జనవరి నుంచి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి 50ఇళ్లకు గ్రామ వాలంటీర్ పెద్ద కొడుకులా సేవలు చేస్తాడని జగన్ అన్నారు. గత ఐదేళ్లలో ఏ పనికైనా లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. తమ కార్యకర్తలకే జన్మభూమి కమిటీలు ప్రాధాన్యత ఇచ్చేవి. అర్హుల ఇంటికే సంక్షేమ పథకాలు చేరుస్తాం. గ్రామ సచివాలయం పక్కన ఎరువులు-విత్తనాల కేంద్రం ఏర్పాటు చేస్తాం. వ్యవసాయ పనిముట్ల వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తాం. ఆక్వా రంగానికి చెందిన వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తాం అని జగన్ అన్నారు. అభివృద్ధిలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వాలంటీర్లది కీలకపాత్ర. మళ్లీ గెలిచేలా పాలన ఉండాలని సచివాలయ ఉద్యోగులు గుర్తుంచుకోవాలి. మూడేళ్లలో ప్రభుత్వ స్కూళ్లలో మౌలికవసతులు కల్పిస్తాం. స్కూళ్లు, పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మార్పులు తీసుకొస్తాం. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తాం. రాష్ట్రంలో 43 వేల బెల్ట్ షాపులు తొలగించాం. 20శాతం మద్యం షాపులు తగ్గించాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పోస్టుల్లో 50శాతం రిజర్వేషన్లు ఇస్తాం. స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చేలా చట్టం తీసుకొచ్చాం అని సీఎం జగన్ అన్నారు.

**బెల్టు షాపులను ఎత్తేసాం**

గుడి,బడి అన్న తేడా లేకుండా ప్రతి గ్రామంలో బెల్టు షాపులను తెరిచిన చరిత్ర గత పాలకులది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే మద్యం అమ్మకాలను 20శాతం తగ్గించాం. ఉగాది నాటికి ఇళ్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్ల పట్టాలు ఇస్తాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులను కల్పిస్తాం. ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా మా పాలన సాగుతోంది. రానున్న రోజుల్లో కచ్చితంగా వందశాతం అక్షరాస్యతను సాధిస్తాం. ప్రతి ప్రభుత్వ పథకాలను డోర్‌డెలివరీ చేస్తాం. ఎవరైనా వాలంటీర్లు అవినీతి, పక్షపాతానికి పాల్పడితే 1902కు ఫోన్ చేసి నేరుగా సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చు. అక్టోబర్ 15న వైఎస్సార్ రైతు భరోసా పథకం ప్రారంభిస్తాం. జనవరి 26న అమ్మఒడి కార్యక్రమానికి శ్రీకారం. ఉగాది నాటికి 25లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తాం' అని జగన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పిల్లి సుభాస్ చంద్రబోస్, కన్నబాబు తదితరలు పాల్గొన్నారు. సిఎం జగన్‌కు ఈ సందర్భంగా శాలువతా సత్కరించి బండిని బహుకరించారు.

# మాట నిలబెట్టుకున్న మహానుభావుడు జగన్

## కౌలు రైతులకు అండగా నిలిచారు: పిల్లి

కాకినాడ,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): ఇచ్చిన మాట నెరవేర్చి వైఎస్ జగన్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా, చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచారని ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ ప్రశంసించారు. కౌలు రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాంధవుడిగా మారారని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రారంభించేందుకు బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కరప గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో కరప గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో ఉపముఖ్య మంత్రి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. ఇచ్చిన మాట నిలబెట్టుకునే ఏకైక వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. ఇచ్చిన మాట జవదాటని నేత దివంగత మహానేత వైఎస్సార్ అయితే.. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వరి అత్యధికంగా పండిస్తూ రాష్ట్రానికే కాక దేశానికి అన్నం పెడుతున్న ఈ రెండు జిల్లాలను ఆ రోజు వైఎస్సార్ ఆదరించారని గుర్తు చేశారు. ఈ రోజు సాగు చేస్తున్న రైతుల పట్ల వైఎస్ జగన్ కరుణ చూపిస్తున్నారని ఉపముఖ్యమంత్రి సుభాష్ కొనియాడారు.

రైతులకు సీఎం జగన్ భరోసా కల్పిస్తూ, భూ యజమానులకు, కౌలు రైతులకు న్యాయం చేస్తున్నారన్నారు. ఉదారంగా రైతులను ఆదుకుంటున్నారని తెలిపారు. ఒకప్పుడు తూర్పుగోదావరి జిల్లా రైతులు ఉత్సాహంగా సాగు చేసేవారని, ప్రస్తుతం వారు నష్టాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత రైతులు దాదాపు 5 లక్షల మంది వలస వెళ్లారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. అందరికీ సాయం చేసేందుకు ముందుకువచ్చిన వైఎస్ జగన్‌ను అభినందించాలని ఆయన కోరారు. రాష్ట్రంలోనే 2.60 లక్షల మంది వాలంటీర్లుగా, 1.30 లక్షల మందిని సచివాలయ ఉద్యోగులుగా నియమించారని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సీఎం జగన్ దమ్మున్న నాయకుడు: కురసాల**

ప్రతి పనిలో చిత్తశుద్ధి, పారదర్శకతతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. నాలుగు నెలల పాలనలోనే 4 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజారంజక పాలన అందిస్తూ దేశంలోనే ఆదర్శప్రాయుడిగా సీఎం జగన్ మారారన్నారు. 2019 ఎన్నికల శంఖారావాన్ని కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచే వైఎస్ జగన్ పూరించారన్నారు. దేశం మొత్తం చూసేవిధంగా ఎన్నికల ఫలితాల్లో 151 అసెంబ్లీ స్థానాలు, 22 ఎంపీ స్థానాలు సాధించి, నాయకుడు అంటే ఈయనేనని వైఎస్ జగన్ దేశానికి చూపించారని పేర్కొన్నారు. ఒక వ్యవస్థను రూపొందించి దాన్ని అమలు చేయడానికి దమ్ముండాలని, అలాంటి దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అని మంత్రి కన్నబాబు కొనియాడారు. చంద్రబాబు వస్తే జాబు వస్తుందని గత ప్రభుత్వం ప్రచారం చేసుకుందని, కానీ చంద్రబాబు హయాంలో ఎవరికీ ఒక్క జాబు కూడా రాలేదని విమర్శించారు. వైఎస్ జగన్ సీఎం అయిన తరువాత యువత అంతా జగనన్న వచ్చాడు. జాబు ఇచ్చాడని నినదిస్తోందని తెలిపారు. ప్రజల ముందుకు నిజమైన గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ తీసుకువచ్చారని, దశలవారీగా మద్య నిషేధం మంగళవారమే ప్రారంభమైందని పేర్కొన్నారు. ఇంతటి సుపరిపాలనలో భాగస్వాములు అయినందుకు గర్వపడుతున్నానని మంత్రి కన్నబాబు అన్నారు.

**దేశమంతా ఆంధ్ర రాష్ట్రవైపు చూస్తుంది.**

గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపం గ్రామ సచివాలయమని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ప్రజలందరి ఆశీర్వాదాలు సీఎం వైఎస్ జగన్‌కు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గాంధీ కోరుకున్న గ్రామ స్వరాజ్యం మాటను నిజం చేస్తూ వైఎస్ జగన్ గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకువచ్చారని అన్నారు. ఉద్యోగం వచ్చిన కుటుంబాలు నా బిడ్డకు జగనన్న ఉద్యోగం ఇచ్చాడని ఆనందపడుతూ సీఎంను ఆశీర్వదిస్తున్నారన్నారు. నేను ఉన్నాను.. నేను విన్నాను అని మాత్రమే కాకుండా నేను ఉంటాను.. మీకు అన్నీ చేస్తానని సీఎం జగన్ ముందుకు వెళుతున్నారన్నారని కొనియాడారు. సీఎం జగన్‌కు ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


నము

ప్రపంచరికార్డులు సాధించిన శ్రీ త్యాగరాయ గానసభ

డుకలు

రాల ప్రదానం

ద్యాలయం



విజయ పురస్కారాల స్వీకర్తలు



డా॥పి.లలితవాణి
సాహిత్యం

శ్రీమతి లంకాఅనూరాధ
సామాజిక సేవ



సాంస్కృతిక కార్యక్రమం
దసరా సరదాలు - మహిళా కవిసమ్మేళనం
నిర్వహణ : బి.కళాగోపాల్
కవయిత్రి

కవిసమ్మేళనంలో పాల్గొనువారు

డా॥తెన్నేటి సుధాదేవి
శ్రీమతి టి.వి.శిరీష
శ్రీమతి నందిమళ్ళ మాధవీ శ్రీనివాస్
శ్రీమతి జ్యోతిరాజ్ భీశెట్టి
శ్రీమతి పద్మశ్రీలత
శ్రీమతి కె.సుబ్బాయమ్మ
శ్రీమతి పి.వి.ఉమాశశి
శ్రీమతి మల్లాది విజయలక్ష్మి
శ్రీమతి ఎమ్.అరుణకుమారి

లలిత కళావేదిక (శ్రీ త్యాగరాయగానసభ), చిక్కడపల్లి, హైదరాబాద్

శ్రీ త్యాగరాయ గానసభ
శ్రీమతి కళాశారద దీక్షితులు
ప్రధానకార్యదర్శి

# మహాత్ముడి కలలను సాకారం చేయాలి

### బాపూ మార్గం అందరికీ ఆదర్శనీయం
### జయంతి వేడుకల్లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
### ప్లాస్టిక్ వాడకాలకు దూరంగా ఉండాలని పిలుపు

నిర్మల్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): జాతిపిత మహాత్మా గాంధీ కన్న కలలు, ఆలోచనలను, సిద్ధాంతాలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పిలుపునిచ్చారు.. శాంతి, అహింసే ఆయుధంగా బ్రిటిషర్లతో పోరాడిన గొప్ప నాయకుడు మహాత్మా గాంధీ అనీ, ఆయన చూపిన పోరాట మార్గం మనందరికీ ఆదర్శనీయమని మంత్రి అన్నారు. బుధవారం గాంధీజీ 150 జయంతిని పురస్కరించుకొని నిర్మల్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం, గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన గొప్ప వ్యక్తి గాంధీ అనీ, సత్యం కోసం తన జీవితాన్ని అర్పించిన మహనీయులు గాంధీజీ అని కొనియాడారు. గాంధీ చూపిన అహింస, సత్యాగ్రహ స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించారని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. ఎక్కడ శాంతి ఉంటుందో అక్కడ అభివృద్ధి ఉంటుందనే భావనతో రాష్ట్రంలో శాంతి భద్రతలు పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిమ్మ రాజులు పాలించిన నిర్మల్ ప్రశాంతతకు మారుపేరని మంత్రి అన్నారు. మరోవైపు ప్లాస్టిక్ వాడకం నుంచి ప్రజలను దూరం చేయటంతోపాటు.. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు అందరూ సహకరించాలని మంత్రి ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ యం.ప్రశాంతి, ఎస్పీ శశిధర్ రాజు, డీఎఫ్‌వో ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, జడ్పీటీసీ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్ముడికి బాలీవుడ్ నివాళి
### ట్విట్టర్ వేదికగా సందేశాలు

న్యూఢిల్లీ,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): మహాత్మ గాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని బాలీవుడ్ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా నివాళి ఆర్పించారు. సల్మాన్ ఖాన్ ట్విటర్ వేదికగా అభిమానులను ఉద్దేశించి స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని, ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని అనుసరించాలన్నారు. 'ఈ రోజు గాంధీ జయంతి. ఈ సందర్భంగా పౌరులందరూ ఫిట్ ఇండియా కార్యక్రమం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో స్వచ్ఛంధంగా పాల్గొనాలన్నారు. ఫిట్ ఇండియా, ఫిట్ ఇండియన్, క్లీన్ ఇండియా, క్లీన్ ఇండియన్' అంటూ ట్విటర్లో వీడియోను పంచుకున్నారు. రాజకీయ నాయకుడు, నటుడు సన్నీ డియోల్ మహాత్మ గాంధీ 150 జయంతి, భారత మాజీ ప్రధాని మంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని నివాళి ఆర్పించారు. 'దేశ అభివృద్ధికి, ప్రగతికి కారణమైన మహాత్మునికి నివాళి' అంటూ ఫిల్మ్ మేకర్ మధుర్ భండార్కర్ పోస్ట్ చేశారు. అహింసనే మార్గంగా ఎంచుకున్నమహాత్మునికి నివాళి. ఆయన మార్గంలోనే ప్రజలంతా శాంతి యుతంగా ఉంటూ, అందరినీ ప్రేమించాలి' అంటూ దియా మీర్జా ఆమె ట్విటర్లో పేర్కొన్నారు. మహాత్ముడు బోధించిన అహింస మార్గాన్ని అనుసరిస్తూ, ఇతరుల పట్ల ప్రేమ చూపిస్తూ ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాలి. ఆయన జీవిత చరిత్ర తరతరాలకు స్ఫూర్తిదాయకం అంటూ మాధురీ దీక్షిత్ నేనే నివాళి ఆర్పించారు.

# హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు

### ఎన్నికల్లో మద్దతుపై పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం
### టీఆర్ఎస్ విధానాలపై మండిపడ్డ ప్రొఫెసర్ కోదండరామ్

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): హుజుర్‌నగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రో.కోదండరాం ప్రకటించారు. ఎన్నికల్లో మద్దతుపై పార్టీ నేతలతో చర్చించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. సీపీఐ, సీపీఎంతో పాటు ఇతర పార్టీల ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దింపాలని ప్రయత్నాలు చేసినట్టు ఆయన తెలిపారు. అయితే ఆ ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్టు కొదండరాం చెప్పారు. ఈ నేపథ్యంలోనే టీఆర్ఎఎస్ విధానాలు ఆయన ఎండగట్టారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తన స్వంత ఆస్తిగా భావిస్తోందని ఆయన విమర్శించారు. అనేక మంది పోరాటాల ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఏ కార్యాక్రమంలో కూడ ప్రజల భాగస్వామ్యానికి విలువ ఇవ్వడం లేదని చెప్పిన ఆయన ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన వారిపై నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తుందని ఆరోపణలు చేశారు. టీఆర్ఎస్ నిరంకుశత్వాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు ఉప ఎన్నికలను వాడుకుంటామని ఆయన చెప్పారు. కొందరి స్వార్థం కోసం సహజవనరులను ప్రభుత్వం కొల్లకొడుతుందని ఆయన ఆరోపణలు చేశారు. కాగా హుజుర్‌నగర్ ఉప ఎన్నికల్లో గెలిచేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేస్తుందని విమర్శించారు. గెలుపుకోసం మొత్తం మంత్రివర్గం పని చేస్తోందని ఆయన మండిపడ్డారు. మరోవైపు అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేసేందుకు సర్పంచ్‌లను అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. ఇక సీపిఐ అధికార టీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వడం చారిత్రక తప్పిదంగా కొదండరాం అభివర్ణించారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన తర్వాత ఆ పార్టీ నేత గూడురు నారయణ రెడ్డి కోదండరాంకు స్వీట్ తినిపించారు.

# మెట్రో స్టేషన్లలో లోపాల గుర్తింపు

### సరిదిద్దే పనిలో మెట్రో యంత్రాంగం
### ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు
### వెల్లడించిన ఎండి ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్3 (ఆంఎన్ఎ): వివిధ మెట్రో స్టేషన్‌లలో లోటుపాట్లపై అధికారులు స్పందించారు. అమీర్ పేటలో పెచ్చులు ఊడిపడి ఒక యువతి మరణించిన సంఘటన అందరిలో తీవ్ర విషాదాన్ని నింపింది. తర్వాత కొన్ని స్టేషన్ లలో ఉన్న లోపాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో భద్రతాపరమైన అంశాలను సీఎం ఆర్ఎస్ ప్రత్యక్షంగా పరిశీలించారు. మిగతా స్టేషన్‌లపై సమీక్షలు జరిపారు. దీనితో ఎక్కడెక్కడ ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయో అధికారులు గుర్తించారు. ఇందు కోసం ఆరు ఎల్ఎన్టి ఇంజనీరింగ్ టీమ్‌లు రంగంలోకి దిగాయి. ఇప్పటి వరకు పది స్టేషన్ లలో లోపాలను గుర్తించి వాటిని సవరించారు. ఇటు ప్రభుత్వం అటు సీఎం ఆర్ఎస్ ఆదేశాలతో అన్ని స్టేషన్ లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా అర్ధరాత్రి తర్వాత ఫ్లడ్ లైట్ల వెలుతురులో బూమ్ లిఫ్స్ ఉపయోగించి మరమ్మతులు చేస్తున్నట్లుగా ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. ప్రతీ స్టేషన్ నిర్మాణానికి సంబందించి చిన్న చిన్న విషయాల్ని కూడా జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్లుగా వివరించారు. అనుభవజ్ఞులైన ఇంజినీరింగ్ బృందాలు భద్రతే ప్రధానంగా ఎక్కడా రాజీపడకుండా పరిశీలించి లోపాలు సవరిస్తున్నట్లుగా చెప్పారు. అమీర్ పేటలో ఘటన జరిగిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు కూడా మెట్రో అధికారులు, ఎల్ఎన్టి అధికారాలు కూడా స్పందించి తక్షణమే చర్యలు కూడా చేపట్టారు. దీనికి సంబంధించి దాదాపు డెబ్బై రెండు కిలో మీటర్ల ఉన్నటువంటి అరవై నాలుగు మెట్రో స్టేషన్స్ లో దాదాపు నలభై ఎనిమిది వాడకంలో ఉండగా, వాటిలో పది స్టేషన్స్ లో కూడా ఈ లోపాలను అధికారులు గుర్తించారు. ఎక్కడెక్కడైతే పగుళ్ళు ఉన్నాయో, సీలింగ్ కి సంబంధించి,పెచ్చులు ఊడిపోయినటువంటి వాటికి సంబంధించి మొత్తం కూడా సర్వేకు సంబంధించి ఇలాంటి లోపాలన్నిటిని కూడా గుర్తించారు. దాదాపు అన్ని వీలైనంత త్వరలో అన్నింటిని సవరించే పనిలో పడ్డారు అధికారులు. బాలానగర్ మెట్రో స్టేషన్, పరేడ్ గ్రౌండ్స్, రసూల్ పురా మెట్రో స్టేషన్, హైటెక్ సిటీ, గంధీభవన్, ఎల్బీనగర్, న్యూ మార్కెట్ ఇలా దాదాపు పది స్టేషన్స్ లో మాత్రం మరమత్తులు పూర్తి చేశారు అధికారులు.ఇంకా ఇలాంటి దారుణమైన సంఘటనలు జరగకమందే అధికారులు వీలైనంత త్వరలో పరిశ్కరించాలని ప్రజలు కొరుతున్నారు.

# శాస్త్రవేత్త హత్య కేసు

### కొనసాగుతున్న విచారణ

హైదరాబాద్,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న శాస్త్రవేత్త శ్రీధరణ్ సురేష్ (56) హత్య కేసులో పురోగతి సాధించారు. ఓ వ్యక్తిని పోలీసులు అనుమానించి దర్యాప్తు అటువైపు సాగిస్తున్నారు.

శ్రీధర్ అమీర్‌పేటలో మంగళవారం దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. 48 గంటలు గడిచినా.. కేసుకు సంబంధించి పోలీసులు ఎలాంటి ఆధారాలను సేకరించలేకపోయారు. సురేష్ కాల్‌డేటా ఆధారంగా విచారణ కొనసాగిస్తున్నారు. సురేష్ వద్దకు తరచూ ఒక్క యువకుడు వచ్చేవాడని అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ తెలిపాడు. ఆ వ్యక్తి ఎవరు, ఎక్కడి నుంచి వచ్చాడన్న దానిపై పోలీసులు దృష్టి సారించారు.

ప్రాథమిక విచారణలో హత్యగా తేల్చిన పోలీసులు.. పోస్ట్‌మార్టం పూర్తి అయ్యాక సాయంత్రం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్య, కుటుంబ సభ్యులు ఇప్పటికే హైదరాబాద్‌కు చేరుకున్నారు. కేరళకు చెందిన శ్రీధరణ్ సురేష్ (56) అమీర్‌పేట్ ధరంకరం రోడ్డులోని అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్ నం ఎస్-2లో నివాసం ఉంటున్నాడు. బాలానగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ పరిశోధన సంస్థలో సురేష్ శాస్త్రవేత్తగా పనిచేస్తుండగా.. భార్య ఇందిర ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరి కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా.. కుమార్తె రమ్యకు వివాహం జరిగింది. 2005లో భార్య బదిలీపై తమిళనాడుకు వెళ్లడంతో సురేష్ ఒక్కడే నగరంలో ఉండేవాడు.

# నిర్బంధం నుంచి పలువురు నేతల విడుదల

జమ్మూ,అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): జమ్ము కశ్మీర్‌లో నిర్బంధంలో ఉన్న పలువురు నేతలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ప్రభుత్వం స్థానిక నాయకులపై విధించిన ఆంక్షలను సడలించింది. మాజీ ముఖ్య మంత్రులైన మెహబూబా ముఫ్తీ, ఓమర్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లా సహా ఇతర అగ్రనేతలు ఆగస్టు 5 నుంచి గృహ నిర్బంధంలో ఉన్న సంగతి తెలిసిందే. స్థానిక సంస్థలైన బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (బీడీసీ) ఎన్నికల దృష్ట్యా వారిని విడుదల చేసే నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారు. ఇప్పటివరకూ విడుదలైన వారిలో దేవేంద్రసింగ్ రానా(ఎన్సీ), హర్షదేవ్ సింగ్ (ఎన్‌పీపీ), రామన్ భల్లా(కాంగ్రెస్) తదితరులు ఉన్నారు. బీడీసీ ఎన్నికల దృష్ట్యా గృహ నిర్బంధంలో ఉన్న నాయకులందర్నీ విడుదల చేయాలని రాష్ట్రానికి చెందిన జమాత్-ఎ-ఇస్లామీ హింద్ (జేఐహెచ్) అనే పార్టీ కూడా మంగళవారం ప్రభుత్వాన్ని కోరింది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో కీలకం కాబట్టి నిర్బంధంలో ఉన్న నాయకులందర్నీ విడుదల చేయాలని, అప్పుడే న్యాయమైన, పారదర్శకమైన ఎన్నికలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని ఆ పార్టీ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. జమ్ము కశ్మీర్‌లో 310 బీడీసీలకు ఎన్నికలు ఆక్టోబరు 24న జరగనున్నాయి. పంచాయతీలో సభ్యులుగా ఉన్నవారు ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటారు. వీరు బ్లాక్ అభివృద్ధి మండలి (బీడీసీ) పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు.

# చేతికొస్తున్న పత్తిపంట

### పలు జిల్లాల్లో పెరిగిన పంట విస్తీర్ణం
### కొనుగోళ్లకు సన్నద్ధం అవుతున్న సిసిఐ

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పత్తి పంట సాగు ఈయేడు మరింత అధికంగా రానుందన్న సూచనలు కనిపిస్తున్నాయి. ఈయేడు జిల్లాల్లో పత్తి పంట సాగు గణనీయంగా పెరిగింది. ప్రధానంగా ఆదిలాబాద్, వరంగల్,ఖమ్మం జిల్లాల్లో పత్తి సాగు పెరిగింది. దీనిని కొనుగోలు చేసేందుకు మార్కెటింగ్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులకు తట్టుకునే పత్తి పంట కొనుగోళ్ల ప్రక్రియ మరో పక్షం రోజుల్లో ప్రారంభంకాబోతుంది. పత్తి కొనుగోళ్లను చేసేందుకు ఏర్పాట్లను సిద్దం చేస్తున్నారు. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలో ఈ యేడు లక్షా 32వేల హెక్టార్లలో పత్తి పంట సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతీ రైతుకు ప్రత్యేక గుర్తింపు కార్డులను అందజేసి అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ వ్యవసాయ మార్కెట్ (నామ్) విధానంతో రైతుల నుంచి పత్తి పంటను కొనుగోలు చేసి రైతులకు నేరుగా కాకుండా ఆన్‌లైన్ విధానంలో చెల్లింపులు చేయనున్నారు. పత్తి పంట విక్రయించిన వెంటనే ఆర్టీజీఎస్ విధానం రైతులకు వర్తించనున్నది. ఇక రైతులకు చెల్లింపుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో నెలకొన్న సమస్యలతో పాటు తరుచు ధరల్లో హెచ్చు తగ్గుల కారణంగా గతేడు పత్తి పంట సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేశారు. దీంతో సరైన గిట్టుబాటు కాక పోవడంతో తిరిగి రైతులు పత్తి పంట సాగు వైపే మొగ్గు చూపారు. గత యేడు దాదాపు 23లక్షల 20వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. సీసీఐ అధికారులు నాణ్యత పేరిట కొనుగోలుకు కొర్రీలు పెట్టడంతో కొంత మంది రైతులు ఆందోళనలు చేయడం రివాజుగా మారుతుంది. ఇప్పటి వరకు తేమ శాతం నిర్ధారణపై స్పష్టత లేదని అధికారులు చెబుతున్నారు. అయితే 8నుంచి 12 శాతం వరకు తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఈసారి దసరా పండుగ తర్వాత ఈ నెల 20వ తేదీన పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే తేమ శాతం పరికరాలను మార్కెట్ యార్డులో రైతులకు అసౌకర్యాలు కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ యేడు పంట విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో 18లక్షల క్వింటాళ్ల వరకు పత్తి పంట దిగబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈసారి కేవలం రూ.100 మద్దతు ధరను పెంచిన ప్రభుత్వం క్వింటాలుకు రూ.5550 మద్దతు ధరగా నిర్ణయించింది. అయితే ప్రతి ఏటా పత్తి పంట కొనుగోలు ప్రక్రియలో నాణ్యత వ్యవహారం రకరకాల సమస్యలకు కారణమవుతుంది. దీని కారణంగానే గత నాలుగైదేళ్ల క్రితం రైతులు ఆగ్రహానికి గురై వ్యవసాయ శాఖ కార్యాలయంపై దాడికి దిగిన విషయం తెలిసిందే. సీసీఐ నిబంధనల ప్రకారం 8నుంచి 12శాతం మాత్రమే తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇంత కన్న ఎక్కువ శాతం తేమ ఉన్నట్లయితే ఆ పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు నిరాకరిస్తారు. ఇప్పటికే తేమ విషయంపై మార్కెటింగ్ శాఖ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. రైతుల్లో తేమ శాతంపై అధికారులు ముందస్తు అవగాహన కల్పించకపోవడంతోనే రైతులు తేమను పట్టించుకోకుండా పత్తిని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తుంటారు. దీంతోనే ప్రతి ఏటా వివాదాలు తలెత్తుతున్నాయి. అయితే రైతులు మాత్రం దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, సీసీఐ అధికారులు, కొంత మంది ప్రైవేట్ పత్తి వ్యాపారులు సిండికేటుగా మారి నాణ్యత విషయంలో రాద్దాంతం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ల÷తులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను ఆదరబాదరగా అమ్మేసుకోవడం కంటే నిధానంగా సరైన ధర పలికినప్పుడే అమ్ముకోవడం ఎంతో మంచిది. అన్నదాతల అవసరాన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారులు ధరలో హెచ్చుతగ్గులు సృష్టించడంతో రైతులకు తీవ్రంనష్టం కలుగుతోంది.

# బాపూ గొప్పతనాన్ని స్మరించుకున్న విదేశాలు

### మహాత్మా గాంధీపై మూడు దేశాల్లో పోస్టల్ స్టాంపులు

న్యూఢిల్లీ,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): బ్రిటీష్ సామ్రాజ్యం నుంచి భారత దేశానికి విముక్తి కల్పించడానికి అహింసాయుత మార్గంలో అసమాన పోరాటాలను చేసిన జాతిపిత మహాత్మాగాంధీని మనదేశం ఒక్కటే కాదు.. ప్రపంచం మొత్తం స్మరించుకుంటోంది. రక్తం చిందించకుండా తెల్లదొరలను దేశం నుంచి తరిమి గొట్టిన అసమాన పోరాట యోధునిగా కీర్తిస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మహాత్ముడి అహింసా మార్గాన్ని గుర్తు చేస్తున్నాయి. ఇందులో భాగంగా.. మూడు దేశాలు ఒకేసారి మహాత్మా గాంధీపై పోస్టల్ స్టాంపులను విడుదల చేశాయి. మహాత్మా గాంధీ 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని టర్కీ, పాలస్తీనా, ఉజ్బెకిస్తాన్ దేశాలు ప్రత్యేకంగా పోస్టల్ స్టాంపులను విడుదల చేశాయి. స్వాతంత్య పోరాటాన్ని ముందుండి నడిపించిన మహానేతగా ఉజ్బెకిస్తాన్ మహాత్మా గాంధీని కీర్తించింది. ఆయనపై ముద్రించిన పోస్టల్ స్టాంపును ఆ దేశ రాయబార కార్యాలయం అధికారులు విడుదల చేశారు. ఉత్కృష్ట వ్యక్తిత్వం గల నేత అనే పదాలను ముద్రించింది. పాలస్తీనా కొద్దిపాటి మార్పులతో అదే రకమైన స్టాంపును విడుదల చేసింది. దీన్ని పాలస్తీనా సమాచార, సాంకేతిక శాఖ మంత్రి ఇసాక్ సెదర్ ఆవిష్కరించారు. అనంతరం దీన్ని రమల్లా వెస్ట్ బ్యాంక్ లోని భారత రాయబార కార్యాలయ ప్రతినిధి సునీల్ కుమార్‌కు అందజేశారు. మహాత్మా గాంధీని స్మారకార్థం ఈ పోస్టల్ స్టాంపును విడుదల చేశామని ఇసాక్ తెలిపారు. బానిస సంకెళ్ల నుంచి భారత్ ను మాత్రమే కాదు.. యావత్ ఆసియా ఖండాన్ని తప్పించిన మహనీయుడిగా అభివర్ణించింది టర్కీ. ఈ మేరకు ఆ దేశ పోస్టల్ శాఖ ఓ అధికారిక లేఖను, స్టాంపును విడుదల చేసింది. భారత ఉపఖండంలో స్వేచ్ఛా వాయువుల కోసం ఆయన తన ప్రాణాలను సైతం లెక్క చేయలేదని కొనియాడింది. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం కల్పించడానికి దశాబ్దాల కిందటే ఆయన పోరాటం చేశారని, దాని సత్ఫలితాలను ప్రపంచం మొత్తం ఇప్పుడు రుచి చూస్తోందని పేర్కొంది. జాత్యహంకారాన్ని ఎదిరించిన యోధునిగా కీర్తించింది. పేదరిక నిర్మూలన కోసం అహర్నిశలు శ్రమించారని మహాత్మాగాంధీని స్మరించుకుంది.

# స్వచ్ఛత కోసం మనమంతా నడుం బిగించాలి

### -పాదయాత్రచేపట్టిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ప్రపంచంలోనే శక్తిమంతమైన, అవినీతి రహిత దేశంగా భారత్‌ను నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. స్వచ్ఛ భారత్ కోసం మనమంతా నడుం బిగించాల్సి ఉందన్నారు. మహాత్మాగాంధీ 150వ జయంతి సందర్భంగా నగరంలోని ఖైరతాబాద్ గణేలిష్ చౌక్ వద్ద 'గాంధీ సంకల్ప్' యాత్రను కిషన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం యాత్రలో పాల్గొన్న ఆయన ప్లాస్టిక్‌ను వాడబోమంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు మహాత్ముడి స్ఫూర్తితో ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఈ యాత్ర చేపట్టినట్లు చెప్పారు. 150 కి.మీ. వరకు సాగే ఈ పాదయాత్రలో ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛ భారత్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. మహాత్ముడు కూడా స్వాతంతకర్యంతో పాటు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారని కేంద్రమంత్రి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డితో పాటు పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి కూడా గాంధీజీ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి చెప్పారు. గాంధీజీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతీ నాయకుడు పని చేయాలని అన్నారు. అహింస, స్వచ్ఛభారతం, పర్యావరణ పరిరక్షణ, అవినీతి రహిత పాలన మహాత్ముడి ఆశయాలన్నారు. ఈ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, నవ భారత్ నిర్మాణం చేయాలని కిషన్ పిలుపునిచ్చారు.

# హరితహారం అందరికీ ఆదర్శం

### మొక్కలు నాటితేనే గ్రామాల్లో పచ్చదనం
### ఆదర్శంగా సాగుతున్న గ్రామప్రణాళిక: మంత్రి

నిర్మల్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): కేసీఆర్ ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమం ఎంతో గొప్పదని ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. వర్షాలు దండిగా కురిసినందున ప్రజలు ఎక్కడిక్కడ మొక్కలు నాటి పారిశుధ్యాన్ని కాపాడాలని అన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి రికార్డు సృష్టించిందని మంత్రి అన్నారు. నాలు గేళ్లలో కోటి 50 లక్షల మొక్కలను నాటడం జరిగిందన్నారు. కోతుల విధ్వంసంతో పంటలు నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో వనారవనాన్ని ఏర్పాటు చేసి పండ్ల మొక్కలను పెంచుతుందన్నారు. దీంతో గ్రామాల్లో ఉన్న కోతులు అడవిలోకి వెళతాయన్నారు. ఈ వనంలో 180 రకాల పండ్ల మొక్కలను నాటుతున్నామన్నారు. స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు 30 రోజుల ప్రణాళికను గ్రామగ్రామాన అమలు చేయటం జరుగుతోందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను ఆయా గ్రామాల పాలకవర్గాలతో పాటుగా అధికారులకు అప్పగించి ప్రభుత్వం పకడ్బందీగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు. మొక్కలను నాటి ప్రతి మొక్కను రక్షించాలన్నారు.

# బిజెపి అభ్యర్థి ఆస్తులు 441 కోట్లు

ముంబయి,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): ముంబయి భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు మంగల్ ప్రభాత్ లోధా ముంబయిలోని మలబార్ హిల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ప్రభాత్ ఆస్తులు రూ. 441 కోట్లు అని ఎన్నికల ఆఫిడవిట్‌లో తేలింది. ప్రభాత్, ఆయన భార్యకు సంబంధించి రూ. 252 కోట్ల స్థిరాస్తులు ఉన్నట్లు ఆఫిడవిట్‌లో పేర్కొన్నారు. చరాస్తులేమో రూ. 189 కోట్లు ఉన్నాయి. రూ. 14 లక్షల విలువ చేసే కారు ఉంది. అప్పులు రూ. 283 కోట్లు. దక్షిణ ముంబయిలో ఐదు బహుళ అంతస్తుల భవనాలు, రాజస్థాన్‌లో ఒక ఎ÷-లాట్ ఉంది. ఇక ఈయనపై ఐదు క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆఫిడవిట్‌లో పేర్కొన్నారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు అక్టోబర్ 21వ తేదీన జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు అక్టోబర్ 24న నిర్వహించనున్నారు.

# మధ్యప్రదేశ్‌లో దారుణ ఘటన

### కోపంలో వేలు కొరికి మింగేశాడు

భోపాల్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): చూపుడు వేలును కొరికి.. మింగేసిన ఓ వ్యక్తి ఘటన మధ్యప్రదేశ్ చాంబల్ డివిజన్‌లోని ఓ గిరిజన ప్రాంతంలో చోటు చేసుకుంది. శ్యామ్ మహోర్(45) తన కుమారుడితో కలిసి బైక్‌పై వెళున్నాడు. అస్గర్ ఖాన్(24) అనే యువకుడు కూడా స్కూటర్‌పై వెళ్తూ శ్యామ్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అసభ్యకరంగా మాట్లాడడంతో అస్గర్‌ను శ్యామ్ హెచ్చరించారు. దీంతో ఖాన్.. శ్యామ్ ఎడమ చేతి చూపుడు వేలును కొరికాడు. అంతటితో ఆగకుండా ఆ వేలిని మింగేశాడు. దీంతో అస్గర్‌పై శ్యామ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు

# డిఆర్‌డివోలో ఏడాదిగా ప్లాస్టిక్ నిషేధం

### కఠినంగా అమలు చేస్తున్న అధికారులు

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): డిఫెన్స్‌రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీఓ)లో ఏడాదిగా ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలుచేస్తున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ సంస్థలో ప్లాస్టిక్‌ను నిషేధించి సరిగ్గా ఏడాది కావస్తోంది. ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని కిందటి సంవత్సరం గాంధీ జయంతి సందర్భంగా తీసుకున్న నిర్ణయాన్ని ఇక్కడ ఈ రోజుకూ విజయవంతంగా అమలుచేస్తున్నారు. ఈ క్రమంలో... ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్ బాటిళ్ళు అక్కడ కనబడవు. 'ఏ రకం ప్లాస్టిక్ బాటిళ్ళను కూడా వినియోగిచకుండా ఉండడంలో మా సంస్థలో ఈ రోజుతో ఏడాది దాటింది' అని డీఆర్‌డీఏ అధికారి ఒకరు వెల్లడించారు. డీఆర్‌డీఏ ఛీఫ్‌గా జీ. సతీష్ రెడ్డి పదవీబాధ్యతలు స్వీకరించిన మరుసటి రోజే అంటే ఆగస్ట్ 29న ప్లాస్టిక్ నిషేధంపై నిర్ణయం తీసుకున్నారు. ప్లాస్టిక్‌పే వినియోగించకూడదంటూ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తన కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచే తొలిగా మొదలుపెట్టారు. ఆ తర్వాత మొత్తం సంస్థకంతటికీ విస్తరించారు. మొత్తంమీద డీఆర్‌డీఓ ఇప్పుడు 'ప్లాస్టిక్ ఫ్రీ' సంస్థగా మారిందని ఉద్యోగులు చెబుతున్నారు.

# క్రీడలు

## తొలి సెంచరీనే.. డబుల్‌గా మార్చేశాడు..



హైదరాబాద్: తొలి సెంచరీనే.. డబుల్ సెంచరీగా మార్చిన ఘనత మయాంక్ అగర్వాల్‌కు దక్కింది. దక్షిణాఫ్రికాతో వైజాగ్‌లో జరుగుతున్న తొలి టెస్టులో మయాంక్ ఈ రికార్డును క్రియేట్ చేశాడు. ఈ ఘనతను అందుకున్న నాలుగవ భారత క్రికెటర్‌గా కూడా నిలిచాడు. మయాంక్ 215 రన్స్ చేసి ఔటయ్యాడు. అయితే టెస్టుల్లో ఈ మ్యాచ్‌లోనే మొదటి సారి సెంచరీ చేశాడతను. ఆ సెంచరీనే డబుల్ సెంచరీగా కూడా మార్చుకున్నాడతను. 358 బంతులు ఆడిన మయాంక్.. అయిదవ టెస్టులోనే డబుల్ సెంచరీ చేసిన క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు. మయాంక్ ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లు, అయిదు సిక్సర్లు ఉన్నాయి. కెరీర్‌లో తొలి సెంచరీనే డబుల్‌గా మలిచిన ఇండియన్ ప్లేయర్లలో కరుణ్ నాయర్, వినోద్ కాంబ్లీ, దిలీప్ సర్దేశాయిలు ఉన్నారు. గత నాలుగు టెస్టుల్లో మయాంక్ 39.28 యావరేజ్‌తో 275 రన్స్ చేశాడు. అయితే అయిదవ మ్యాచ్‌లోనే తన కెరీర్ బెస్ట్ స్కోర్‌ను దాటేశాడు. ఇంతకుముందు ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో మయాంక్ అత్యధికంగా 77 రన్స్ చేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో డబుల్ సెంచరీ చేసిన 86వ క్రికెటర్‌గా అగర్వాల్ రికార్డు కెక్కాడు. టెస్టుల్లో ఇండియన్ ప్లేయర్ డబుల్ సెంచరీ చేయడం ఇది 52వ సారి కావడం విశేషం. సౌతాఫ్రికాపై తొలుత మయాంక్-రోహిత్‌లు తొలి వికెట్‌కు 317 రన్స్ జోడించారు. ఆ ఇద్దరూ 11 ఏళ్ల క్రితం నాటి రికార్డును బ్రేక్ చేశారు. గతంలో ఇండియన్ జోడి సెహ్వాగ్-ద్రావిడ్‌లు తొలి వికెట్‌కు 268 రన్స్ చేశారు. ఇప్పుడా ఆ రికార్డు బ్రేకయ్యింది.

## రైడింగ్‌లో అదరగొట్టిన పవన్..

### బుల్స్ ఘనవిజయం

పంచకుల: బెంగళూరు బుల్స్ స్టార్ రైడర్ పవన్ షెరావత్ రికార్డు స్థాయిలో రైడింగ్ పాయింట్స్ తేవడంతో హర్యానా స్టీలర్స్‌పై బుల్స్ 56-39తో ఘనవిజయం సాధించింది. పవన్ 39 రైడింగ్ పాయింట్స్‌తో ప్రొ కబడ్డీ లీగ్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన రైడర్‌గా రికార్డు సృష్టించాడు. ఇంతకు ముందు ఈ రికార్డు పట్నా రైడింగ్ సంచలనం పర్‌దీప్ నర్వాల్(34 రైడ్ పాయింట్స్) పేరిట ఉండేది. ఇప్పుడు ఆ రికార్డును పవన్ షెరావత్ బ్రేక్ చేశాడు. పవన్ విజృంభనతో హర్యానా స్టీలర్స్ హోం గ్రౌండ్ ప్రేక్షకుల మద్దతు ఉన్నప్పటికీ ఓటమి తప్పించుకోలేదు. బుధవారం టౌ దేవిలాల్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ లీగ్ మ్యాచ్‌లో పవన్ చెలరేగిపోయాడు. దాదాపు రైడింగ్‌కు పోయిన ప్రతిసారీ పాయింట్ తీసుకొచ్చాడు. ఈ విజయంతో బుల్స్ ప్లే ఆఫ్స్‌కు చేరువయింది.



# పల్లె ల్లో ఉద్యమంగా పారిశుద్ధ్యం

### గ్రామప్రణాళికతో కానవస్తున్న మార్పు

హైదరాబాద్, అక్టోబర్ 3 (ఆర్ఎన్ఎ): పల్లె వెలుగు కార్యక్రమం ఒక ఉద్యమంగా సాగుతూ పల్లె వెలుగులు పంచుతున్నది. గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రజల్లో అవగాహనతో పాటు, బాధ్యతను కూడా బోధిస్తూ అధికారులు ముందుకు సాగుతున్నారు. 30 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం సెప్టెంబర్ 6న చేపట్టిన గ్రామాభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైన తరవాత కొంతలో కొంతయినా మార్పు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆలోచనతో రూపుదిద్దుకున్న కార్యాచరణ గ్రామాల గుణాత్మక మార్పుకు దోహదం చేస్తున్నది. పచ్చదనం, పరిశుభ్రత, డంపింగ్ యార్డులు, స్మశాన వాటికలు, మురుగు నీటి కాల్వలు, పాడు బడిన బావుల పూడ్చివేత, కూలిన ఇండ్ల శిథిలాల తొలగింపు వంటి పదిహేను పట్టికలతో సాగుతున్న అటు పంచాయితీరాజ్ ఇటు రెవిన్యూ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు,ఎంఎల్ఎలు, మంత్రులు, వాడవాడనా తిరుగుతూ స్వయంగా పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు.ప్రజల్లో అవసరమైన మేరకు చైతన్యం వికసించాలనే ఆలోచనకు అనుగుణంగా గ్రామాభివృద్ధి ప్రణాళిక అమల వుతున్నది. ఎంత మంచి కార్యక్రమమైనా ప్రజల భాగస్వామ్యం లేకుంటే.. ఎంత చేసినా వృథా ప్రయాసే. క్షేత్రస్థాయి అవగాహనతో, దార్శనికతతో ముందుకు పోతున్నరు సిఎం కెసిఆర్. అందులో భాగంగా? సాగునీరు, తాగునీరు, విద్యుత్తు, వ్యవసాయం, విద్య, వైద్యం వంటి సుదీర్ఘ లక్ష్యాలను గాడినపెట్టుకుంటూ, గ్రామీణాభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత, తాగునీరు వంటి మౌలిక రంగాల అభివృద్ధి కార్యక్రమాలను ఒక్కొక్కటిగాఅమలు చేస్తున్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం కేవలం కలెక్టర్లకు అధికారులకు, గ్రామ సర్పంచులకు, వార్డు మెంబర్లకు పరీక్షగా సాగుతోంది. వారిని కార్యోన్ముఖులను చేస్తోంది. జిల్లా నుంచి రాష్ట్ర రాజధాని వరకు ఈ పరిశుభ్రత అనే ఆలోచన విస్తరించాలన్న కాంక్ష పెరిగింది. గ్రామాలను స్వయం పాలనలో అభివృద్ధి పథాన నడిపించడానికి మరో ప్రజా ఉద్యమం అవసరమున్నది. చైతన్యం కావాల్సిన అవసరం స్వయం పాలనలోని తెలంగాణాకు వచ్చింది. దీంతో వ్యక్తిగత పరిశుభ్రత పట్ల చెత్తపట్ల చైతన్యం పెరిగింది. ప్రజలకు అవగాహన పెంచడం వారికి చైతన్యం రగిలించడం వారిలోని సామూహిక శక్తిని సంఘటిత పరచడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రభుత్వం అమలు వరుస్తున్న ముప్పై రోజుల ప్రణాళికలో గ్రామాభివృద్ధిలో పాలు పంచుకుంటున్నారు.

## చెవిలో బొద్దింకల గూడు

### 26 బొద్దింకలు గుర్తించిన వైద్యులు

మెల్‌బోర్న్,అక్టోబర్3 (ఆంఎన్ఎ): చెవిలో విపరీతమైన దురద, నెప్పి రావడంతో ఓ యువకుడు వైద్యుల ను సంప్రదించాడు. వైద్యపరీక్షల అనంతరం అతడి చెవిలో 26 బొద్దింకలున్నాయని చెప్పడంతో ఆశ్చర్యపోయాడు. ఈ సంఘటన ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగింది. లీ(19)కి ఒక రోజు రాత్రి కుడి చెవిలో భరించలేని దురద వచ్చింది. వెంటనే వేలు పెట్టి చూడగా విపరీతమైన నొప్పి మొదలైంది. దీంతో వైద్యులను సంప్రదించాడు. వైద్యపరీక్షల అనంతరం వారు అతడి చెవిలో 26 బొద్దింక పిల్లలున్నాయని గుర్తించారు. లీ చెవి మార్గంలో ఎన్నో వారాలుగా బొద్దింక నివసించి గుడ్లు పెట్టిందని, అందుకే అతడి చెవి దగ్గర చర్మం పాడైందని వివరించారు. అతడు సరైన సమయంలో ఆసుపత్రికి వచ్చాడని లేకపోతే చెవి పూర్తిగా దెబ్బతినేదని పేర్కొన్నారు.

# విద్యా వాలంటీర్ల నియామకం

### ఖాళీల భర్తీ చేసే వరకు కొనసాగింపు

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): తెలంగాణ వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2019-20 విద్యాసంవత్సరానికిగాను పలు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల ఖాళీలను భర్తీఅయ్యే వరకు వీరి సేవలను ఉపయోగించుకుంటారు. తాజాగా వెలువడిన జీవో ద్వారా 18,178 మంది విద్యావాలంటీర్లను నియమించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న రెగ్యులర్, వెకెంట్, లీవ్ వెకెంట్ పోస్టుల్లో 16,870 మందికి నియామకాలను పూర్తిచేశారు. మరో 1,308 మందిని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో తెలుగు టీచింగ్‌కోసం నియమించారు. కొత్తగా నియమితులైన విద్యావాలంటీర్లు 2020 జూన్‌లో తమ విధుల్లోకి జాయిన్ అవుతారు. వారికి నెలకు 12వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తారు. ప్రభుత్వం ఖాళీల్లో నియామకాలను పూర్తిచేసే వరకూ విద్యావాలంటీర్లు కొనసాగుతారు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఒకసారి విద్యావాలంటీర్లను నియమించినా చాలా మందికి గౌరవ వేతనం మాత్రం చెల్లించలేదు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల కోసం ఉపాధ్యాయ సంఘాలు పెద్దయెత్తున ఆందోళనలుచేశాయి.

# అంగన్‌వాడీలకు దసరా కబురు

### ముందే జీతాలు విడుదల చేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): అంగన్ వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. దసరా పండగ నేపథ్యంలో అంగన్ వాడీ ఉద్యోగులకు ముందే వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 83 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అడిగిన వెంటనే అంగన్ వాడీ ఉద్యోగుల వేతనాల కోసం నిధులు విడుదల చేయడంపై గిరిజన, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ ముఖ్యమంత్రి కేసిఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రతి నెల మాసాంతంలో వేతనాలు అందుతున్నాయి. అయితే ఈ నెలలో దసరా పండగ మొదటి వారంలోనే రావడంతో వేతనాలు లేకపోవడం వల్ల పండగకు ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని తెలంగాణ అంగన్ వాడీ సంఘం నేతలు మంగళవారం మంత్రి సత్యవతి రాథోడ్ ను కలిసి వేతనాలు ఇప్పించాలని కోరారు. అంగన్ వాడీల విజ్ఞప్తిని మంత్రి సీఎం కేసిఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో.. వెంటనే స్పందించిన సిఎం ఉద్యోగులకు వేతనాల కోసం నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. దీంతో మంగళవారం రాత్రి అంగన్ వాడీ ఉద్యోగుల వేతనాల నిమిత్తం 83 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అంగన్ వాడీ ఉద్యోగులకు వేతనాలు అందనున్నాయి.

# ప్రజలు పరిసరాలపై శ్రద్ధ పెట్టాలి

### గ్రామ ప్రణాళిక అమలుపై మంత్రుల ఆరా
### గ్రామాల్లో అపరిశుభ్రతపై అధికారులపై ఆగ్రహం

భద్రాద్రి కొత్త గూడెం, అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): గ్రామ ప్రజలు కూడా ప్రతి ఒక్కరూ తమ ఇంటిలాగే భావించి పరిసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రులు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికై తలపెట్టిన గ్రామ ప్రణాళిక - కార్యాచరణలో భాగంగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, సత్యవతి రాథోడ్‌లు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు పల్లెల ప్రగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి 30 రోజుల ప్రణాళికలో భాగంగా ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారని వారు అధికారులను అడిగారు. సీఎం తలపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా అధికారులు భాద్యత తీసుకోవాలని మంత్రులు అన్నారు. సమీక్ష సమావేశానికి ముందు మంత్రుల బృందం ఖమ్మంలోని గాంధీ చౌక్ సర్కిల్‌లో గాంధీజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మంత్రులతో పాటు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర్ రావు, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, మేయర్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఇదే సందర్భంలో గ్రామాల్లో అపరిశుభ్రతపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో అపరిశుభ్రతపై దయాకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి జిల్లాలో పర్యటించారు. గుబ్బగుర్తి గ్రామంలో ఆకస్మిక పర్యటన చేసి గ్రామాన్ని సందర్శించారు. రోడ్ల పక్కన చెత్త వేయడం.. అలాగే కిరణా షాపు యజమాని ఖాళీ బాటిల్స్ బస్తాలు రోడ్డు పక్కనే ఉంచడంతో గ్రామ కార్యదర్శితో పాటు సర్పంచ్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇంకా ఎన్ని రోజులు ఊరును ఇలా ఉంచుతారని మండిపడ్డారు. కిరణ షాపు యజమానికి రూ 5 వేలు ఫైన్ వేయాలని ఆదేశించారు. ఏన్కూరులో కూడా పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. డీపీవోని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. కొణిజర్ల, ఏన్కూర్ మండలంలో అపరిశుభ్రత పట్ల కలెక్టర్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం కేసీఆర్ ఆచరణలో పెట్టారని మంత్రి పువ్వాడ అజయ్ కొనియాడారు. ఏన్కూరు మండలం బీఎన్ తండాలో జరిగిన గ్రామ సభకు మంత్రి హాజరై మాట్లాడారు. పరిశుభ్రత ఉంటే అనారోగ్యం బారిన పడే అవస్థ ఉండదన్నారు. 30 రోజుల ప్రణాళిక చాలా మంచి కార్యక్రమమని తెలిపారు. 30 రోజుల ప్రణాళిక ముఖ్యమంత్రి మానస పుత్రిక అన్నారు. గ్రామ పంచాయితీల్లో డంపింగ్ యార్డులు, వైకుంఠ దానాలకు స్థలాలు సేకరించామన్నారు. గ్రామాల్లో వీధి లైట్లు ఏర్పాటు, హరితహారంలో మొక్కలు నాటినట్లు వెల్లడించారు. గ్రామాల రూపు రేఖలు మారుస్తామని చెప్పారు. గ్రామ పంచాయితీ కార్యదర్శులు, యువతి, యువకులు ఉత్సాహంగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ నామ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ పిల్లకు ర్యాంకులు

### హైదరాబాద్ స్కూల్‌పై నెటింట్లో విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్3 (ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం మాత్రం నర్సరీ, ఎల్‌కెజీ, యూకేజీలో టాపర్లు అంటూ భారీ ఫ్లెక్సీ వేయించి విమర్శలపాలైంది. హైదరాబాద్‌లోని ప్రియా భారతి హైస్కూల్.. తమ నర్సరీ, ఎల్‌కేజీ, యుకెజీ పిల్లల ర్యాంకులు, గ్రేడింగ్‌లతో ఓ భారీ కటౌట్ ఏర్పాటు చేయించింది. తమ టాపర్లు వీరే అంటూ ఘనంగా చెప్పుకుంది. ఆ స్కూల్‌కు తెలంగాణ ప్రభుత్వ గుర్తింపు కూడా ఉన్నట్లుల్లో ఫ్లెక్సీలో పేర్కొంది. నర్సరీ నుంచి ఫస్ట్ క్లాస్ వరకు 44 మంది ప్రతిభ గల విద్యార్థుల ఫొటోలు ఫ్లెక్సీలో ఉన్నాయి. ప్రస్తుతం ఆ కటౌట్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కాగా నర్సరీ పిల్లలకు కూడా ర్యాంకులు కేటాయించడం పట్ల విద్యావేత్తలు మండిపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా నర్సరీ విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను బోధిస్తారని విద్యావేత్తలు గుర్తుచేసున్నారు. చిన్న పిల్లలను పోటీ ప్రపంచంలోకి నెట్టడం విచారకరమని పలువురు నెటిజన్లు ట్విటర్ లో పోస్ట్ చేశారు. 'పిల్లలు పాలు తాగడంలో ఫస్టా..' అంటూ క్రిష్ యాదు అనే నెటిజన్ విద్యాసంస్థలపై వ్యంగ్యంగా ట్వీట్ చేశారు.

# ఐరాసలో భారత్‌కు సభ్యత్వం అనివార్యం

### లేకుంటే దాని విశ్వసనీయతపైనే అనుమానాలు
### విదేశాంగ మంత్రి జయశంకర్

వాషింగ్టన్,అక్టోబర్3 ఆంఎన్ఎ): ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లేని పక్షంలో అది దాని విశ్వసనీయతపై ప్రభావం చూపుతుందని విదేశాంగ శాఖా మంత్రి జయ్‌శంకర్ వ్యాఖ్యానించారు. భద్రతా మండలిలో సభ్యత్వం కోసం కావాల్సి అర్హత భారత్‌కు ఉందని ఆయన స్పష్టం చేవారు. అమెరికాకు చెందిన సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. రాబోయే 10-15 ఏళ్లలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా అవతరించబోతోంది. అటువంటి దేశానికి ఐక్యరాజ సమితి వ్యవహారాలలో తగిన నిర్ణయాధికారం లేకపోతే అది భారత్ ప్రజలను ప్రభావితం చేస్తుంది. అంతే కాకుండా అది ఐక్యరాజ్యసమితి విశ్వసనీయతపైనా ప్రభావం చూపిస్తుందన్నారు. శాశ్వత సభ్యత్వానికి కావాల్సిన అర్హత భారత్‌కు ఉంది. ప్రస్తుత సభ్యదేశాల పరిధిలోలేని అనేక పరిణామాలు అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్నాయి. గత 10-15 ఏళ్ల కాలాన్ని పరిశీలిస్తే..సభ్య దేశాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వని కారణంగా అనేక అంతర్జాతీయ వేదికలు ఒత్తడికి లోనవుతున్నాయని అన్నారు. వాటి విశ్వసనీయతను కోల్పోతున్నాయి. వాణిజ్య పరంగా చూస్తే..అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందాలు ఇక అసాధ్యమనే భావన ప్రబలింది. అందుకే..అనేక దేశాలు తమలో తామే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దశలో భారత్‌కు గుర్తింపు ఒక్కటే శరణ్యమన్నారు.

## హైకోర్టు తీర్పు సర్కార్‌కు చెంపపెట్టు

నల్గొండ,అక్టోబర్3 (ఆంఎన్ఎ): సచివాలయం కూల్చివేతపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. వాస్తు పేరుతో సచివాలయాన్ని కూల్చేయడం సరికాదని సూచించారు. ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే.. లక్ష మందితో కూల్చివేతను అడ్డుకుంటామన్నారు. హుజూర్‌నగర్‌లో సీపీఐ మద్దతు టీఆర్ఎస్ కోరడం అంటే.. ఓటమిని అంగీకరించినట్లేనన్నారు.

# దిగజారిన లెఫ్ట్ భావజాలం

### నారాయణ చీడపురుగన్న బిజెపి నేత ప్రభాకర్

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్ఎన్ఎ): సీపీఐకి నారాయణ చీడ పురుగని బీజేపీ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. సీపీఐ, సీపీఎం సిద్దాంతాలను అమ్ముకున్నాయని, వాటికి ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. నామినేషన్స్ ముందు సీపీఐ.. నామినేషన్స్ తరువాత సీపీఎం టీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నాయని అన్నారు. టీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోయింది కాబట్టే సీపీఐ, సీపీఎంతో కాళ్ళ బేరానికొచ్చిందని ఆరోపించారు. కమ్యూనిస్టులను కేసీఆర్ ఏవిధంగా మాట్లాడారో ప్రజలు మర్చిపోలేదని గుర్తు చేశారు. ఉప ఎన్నికలు అవకాశవాద రాజకీయాలకు పరాకాష్టగా మారాయని, ఎమ్మెల్సీ పదవి కోసం కమ్యూనిస్టులు ఆశపడ్తున్నారని అన్నారు. సీపీఐ, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శులు రాజా, సీతారాం ఏచూరిలకు తాను లేఖ రాయనున్నట్లు పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్, త్రిపుర లానే వామపక్ష భావజాలం ఉన్నవారు బీజేపీకే ఓటు వేస్తారని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.




# 'లాల్ కప్తాన్' ఫైనల్ ట్రైలర్ రిలీజ్..!

సైఫ్ అలీఖాన్ ప్రధాన పాత్రలో నవదీప్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'లాల్ కప్తాన్' . పీరియాడిక్ చిత్రంగా రూపొందిన ఈ చిత్రంలో సైఫ్ నాగ సాధు గెటప్‌లో కనిపించనున్నారు. 18వ శతాబ్దంలో ఓ బ్రిటీష్ కెప్టెన్‌పై పోరాడిన నాగసాధువు కథ ఆధారంగా చిత్రం రూపొందుతుంది. ఇలాంటి పాత్రలో సైఫ్ నటించడం ఇదే తొలిసారి కాబట్టి ప్రేక్షకులు కూడా బాగానే ఆదరిస్తారని చెప్పవచ్చు . అక్టోబర్ 18న చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఇప్పటి వరకు చిత్రానికి సంబంధించి చాప్టర్ 1,2 పేరుతో పలు ట్రైలర్స్ విడుదల చేయగా, తాజాగా మరో ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇందులో సన్నివేశాలు సినిమాపై భారీ అంచనాలు పెంచుతున్నాయి. తెల్ల వాళ్ళతో సైఫ్ పోరాడే తీరు ఆకట్టుకుంటుంది. చిత్రంలో సోనాక్షి సిన్హా అతిథి పాత్రలో కనిపించనున్నారు. మానవ్ విజ్, జోయా హుస్సేన్, దీపిక్ డోబ్రియల్, సిమోన్ సింగ్ కీలక పాత్రలు పోషించారు. కలర్ ఎల్లో ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై ఆనంద్ ఎల్ రాయ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కాగా, సైఫ్.. 'తానాజీ ది అన్‌సంగ్ హీరో', 'దిల్ బిచారా', 'జవానీ జానేమన్' అనే డిఫరెంట్ చిత్రాలతో ప్రస్తుతం బిజీగా ఉన్నారు.

## 'చాణక్య'కు జాక్‌పాట్?

మాస్ హీరో గోపీచంద్ నటించిన మరో యాక్షన్ సినిమా 'చాణక్య'. ఈ సినిమా ఈ నెల ఐదో తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'సైరా' వంటి భారీ సినిమాకు పోటీగా వస్తున్న ఈ సినిమాకు పెద్దగా బజ్ రాలేదు. పబ్లిసిటీ కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. అయితే ఈ సినిమాకు నాన్-థియేట్రికల్ హక్కుల రూపంలో భారీగా ఆదాయం వచ్చిందట.

ఈ సినిమా తెలుగు శాటిలైట్ హక్కులను ఒక ఛానెల్ నాలుగు కోట్ల రూపాయలకు దక్కించుకుందట. అలాగే డిజిటల్ హక్కుల కోసం అమెజాన్ రూ.2 కోట్లు ఇచ్చిందట. అమెజాన్‌లో రాబోతున్న గోపీచంద్ తొలి సినిమా ఇదే కావడం విశేషం. ఇక, హిందీ డబ్బింగ్ హక్కుల రూపంలో ఏకంగా రూ.9 కోట్లు వచ్చాయట. యాక్షన్ సినిమా కావడంతోనే హిందీలో ఈ రేట వచ్చిందట. మొత్తానికి డిజిటల్, శాటిలైట్ రూపంలో ఏకంగా రూ.15 కోట్లు 'చాణక్య'కు రావడం విశేషంగా మారింది

# 'ఇండియన్ 2' లో విలన్‌గా అనిల్ కపూర్ ?

సినిమా




కమల్ హాసన్ , కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ కలయికలో తెరకెక్కుతున్నచిత్రం 'ఇండియన్ 2'. గత కొద్దీ రోజుల నుండి నాన్ స్టాప్ గా షూటింగ్ జరుపుకుంటుంది ఈ చిత్రం. అందులో భాగంగా ఇటీవల రాజమండ్రిలో కమల్ హాసన్ పై కొన్ని కీలక సన్నివేశాలను తెరకెక్కించగా తాజాగా మరో కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ షెడ్యూల్ లో ప్రముఖ బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ జాయిన్ అయ్యాడు. ఆయన ఈ చిత్రంలో విలన్ పాత్రలో నటిస్తున్నాడని సమాచారం. ఇక అనిల్ కు కోలీవుడ్ లో ఇదే మొదటి సినిమా కానుంది. అయితే అనిల్ , శంకర్ డైరెక్షన్ లో నటించడం మొదటి సారేం కాదు. ఇంతకుముందు వీరి కాంబినేషన్ లో నాయక్ అనే చిత్రం తెరకెక్కింది.

సోషల్ మెసేజ్ తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కాజల్ కథానాయికగా నటిస్తుండగా రకుల్ ప్రీత్ సింగ్ , ప్రియా భవాని శంకర్ , సిద్దార్థ్ , వెన్నల కిషోర్, విద్యుత్ జంవాళ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బ్జడెట్ తో లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నాడు. కమల్ -శంకర్ కలయికలో ఇది రెండో చిత్రం ఇంతకుముందు 1996లో వీరి కాంబినేషన్ లో వచ్చిన ఇండియన్ సూపర్ డూపర్ హిట్ అయ్యింది. మరి ఇన్ని సంవత్సరాల తరువాత ఈ చిత్రానికి కి సీక్వెల్ గా వస్తున్న ఈ ఇండియన్ 2 ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి. వచ్చే ఏడాది సమ్మర్ లో ఈ చిత్రం తమిళం తో పాటు తెలుగు ,హిందీ భాషల్లో విడుదలకానుంది. ఇక ఈసినిమా తరువాత కమల్ రాజకీయాల్లో బిజీ కానున్నాడని సమాచారం.

# రోజురోజుకు తగ్గుతున్న టిడిపి ఊపిరి

### పార్టీని వీడుతున్న లీడర్లు,క్యాడర్
### అయోమయంలో తెలంగాణ టిడిపి నేతలు

హైదరాబాద్,అక్టోబర్3(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణలో టిడిపి ఇంకా గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. పార్టీకి చెందిన కిందిస్థాయి క్యాడర్ నుండి మొదలు అగ్రనేతల వరకు అధికార పార్టీలోకి జంప్ అయ్యారు. ఇటీవల పలువురు బిజెపిలో చేరారు. దీంతో పార్టీని పట్టాలకెక్కించే ప్రయత్నాలు ఏవీ పెద్దగా పనిచేయడం లేదు. పార్టీ అధ్యక్షుడు రమణ, మాజీ ఎంపిరావుల సచంద్రశేఖర్ రెడ్డిలు మాత్రమే మిగిలారు. రేవూరి ప్రకాశ్ రెడ్డి, సీతక్క,అరికెల నర్సారెడ్డి, వంటేరు ప్రతాపరెడ్డి తదితరులంతా ఎప్పుడో ఆయా పార్టీల్ల్ఓ కలసి పోయారు. దీంతో టిడిపి కలసి పోరాడుతున్నా పెద్దగా ప్రయోజనాలు కనిపించడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న కేడర్‌ను ప్రోత్సహించే ప్లాన్ చేస్తున్నారు. తెలంగాణలో ఉమ్మడి పది జిల్లాల నుండి ఇప్పటికి టిడిపికి బలమైన నేతలు ఉన్నారని రమణ అంటున్నారు. అందుకే హుజూర్‌నగర్‌లో తమ అబ్యర్థిని బరిలోకి దింపారు. రంగారెడ్డి జిల్లాలో దేవేందర్ గౌడ్ కుమారుడు వీరేందర్ గౌడ్ పార్టీ వ్యవహారాలను నడిపిస్తున్నా, అనూహ్యంగా అతను కూడా బిజెపిలో చేరేందుకు సిద్ధమయ్యారు. తాజాగా రాం మాధవ్‌ను కలసి పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. పాలమూరులో రావుల చంద్రశేఖర్ రెడ్డి అండగా ఉన్నారు. గతంలో కీలక స్థానాలలో పనిచేసిన నేతలు వెళ్లిపోవడంతో ఉన్నవారిని సమన్వయం చేసే బాధ్యతను రమణ తన భుజస్కందాలపై వేసుకున్నారు. ఇటీవల రైతాంగ సమస్యలు, నకిలీ విత్తనాలు,ఎరువుల గొడవ తదితర అంశాలపై పోరాడుతున్నా పెద్దగా కలసి రావడం లేదు. టిఆర్‌ఎస్ దూకుడు తగ్గించి పార్టీని ముందుకు తీసుకుని వెళ్లడంలో చేస్తున్న ప్రయత్నాలకు ప్రజల నుంచి కూడా పెద్దగా స్పందన కానరావడం లేదు. అందుకే తెలంగాణలో టిడిపికి పూర్వ వైభవం తీసుకుని వచ్చేందుకు పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో టిడిపిని వదిలి వెళ్లిన నేతలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించే పక్రియ చేపడదామన్నా ఎవరు కూడా అందుకు సిద్దంగా లేరు.

ఇటీవల హైదరాబాద్ వచ్చిన చంద్రబాబుతో టి టిడిపి నేతలు ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. పార్టీ క్యాడర్ ఎక్కడ చెక్కు చెదరలేదని వారంతా చంద్రబాబుకు చెప్పే ప్రయత్నం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వలసలు పార్టీని తీవ్రంగా కుంగదీశాయి. ఎల్ రమణ పార్టీ అధ్యక్షులుగా ఆయన కనుసన్నలలోనే పార్టీ వ్యవహారాలు నడుస్తున్నాయి. పార్టీని జాతీయపార్టీగా ప్రకటించినా పెద్దగా తెలంగాణలో పార్టీని పట్టించుకోవడం లేదని టి టిడిపి నేతలు వాపోతున్నారు. ఎపిలో పార్టీతో పాటు ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని పరిష్కరించేందుకు చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ నేతలు అంటున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌ను వదిలేసిన పార్టీ ఇపుడు తన మకాంను అమరావతికి మార్చింది. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని బలోపేతం చేయడంపై చంద్రబాబు దృష్టి సారించారని తెలంగాణ లో పార్టీని బతికించుకోవాల్సిన బాధ్యత టి టిడిపి నేతలపైనే ఉందని వారు చెబుతున్నారు. తనకు సహకరించే వారికి ఆర్థికంగా అన్ని విధాలుగా అండదండలు అందిస్తూ పార్టీ కార్యక్రమాలకు రూపకల్పన చేయాలనే యోచనలో రమణ ఉన్నారని టిడిపిలో ప్రచారం జరుగుతుంది.

# ఆ ముగ్గురూ ముగ్గురే

### సోషల్ మీడియాలో హీరోలపై కామెంట్స్
### మోడీ, షా, అజిత్ దోవల్‌లకు ప్రశంసలు

న్యూఢిల్లీ,అక్టోబర్3 (ఆర్‌ఎన్‌ఎ): కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ ఎత్తివేత, అంతకుముందు పాక్ ఆక్రమిత కాశ్మీర్ల్ఓ వైమానిక దాడులతో దేశవాసుల్లో కేంద్ర ప్రభుత్వంపై విశ్వాసం పెరిగింది. అవసరమైతే ఎంతటి దాడికయినా దిగుతామన్న భావన పెరిగింది. దీనికితోడు ప్రధానంగా ముగ్గురు వ్యక్తులపై సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పెరిగింది. అందులో ప్రధాని మోడీ, హోమంత్రి అమిత్ షా,దేశభద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌పై నిత్యం ఏదో ఒక వార్త వస్తోంది. వీరి చేతుల్లో దేశం భద్రంగా ఉంటుందని, పాక్,చైనాల దూకుడుకు అడ్డుకట్ట వేయగలరని, మన సైన్యానికి ఢోకా లేదని ఇలా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఉగ్రవాద శిబిరాలపై సర్జికల్ దాడుల తరవాత మరోమారు బిజెపిపైనా ప్రభావం పడింది. అమాంతంగా బిజెపి గ్రాఫ్ కూడా పెరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని చూసి ఇప్పుడు దేశం గర్వపడుతోందన్న వార్తలుకూడా వస్తున్నాయి. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో సర్జికల్ దాడులు నిర్వహించి ఉగ్ర మూకలను హతం చేయడమే! దీంతో చిన్నా పెద్దా తేడా లేకుండా దేశ ప్రజలంతా ప్రధానిని ప్రశంసిస్తున్నారు. విదేవాల్లో సైతం నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురుస్తోంది. అయితే ప్రధానిమోడీతో పాటు మిగతా ఇద్దరి వ్యూహాలపైనా ప్రశంసలు కురుస్తున్నాయి.

ఇకపోతే అసలు వ్యూహకర్త అజిత్ దోవల్‌పైనా ప్రజలు మనసు పారేసుకున్నారు. ఆ ఒక్కడు చాలు అన్నీ చక్కబెట్టగలడని ప్రజలు జేజేలు పలుకుతున్నారు. యూరీ సెక్టార్‌లో ఉగ్రమూకలు దాడి చేసి మన సైనికులు 19 మందిని పొట్టనబెట్టుకున్న నాటి నుంచీ పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్న అభిప్రాయం దేశ ప్రజలలో ఏర్పడింది .పఠాన్‌కోట్ సంఘటన జరిగిన కొద్ది కాలానికే ఉరీ సంఘటన జరగడంతో పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోవాలని దేశ ప్రజలలో అత్యధికులు కోరుకున్నారు. అయితే ప్రధాని మోదీ మాత్రం గుంభనంగా ఉంటూనే చేయాల్సిందంతా చేసి ప్రజల ఆవేశాన్ని చల్లార్చడమే కాకుండా హీరో అని అనిపించుకున్నారు. దేశ విభజన నాటి నుంచి అటు పాకిస్థాన్, ఇటు భారతదేశంలో పుట్టిన, పుడుతున్న ప్రతి శిశువులో కూడా పొరుగు దేశంపై ద్వేషభావం వ్యాపింపజేస్తున్నారు. పాకిస్థాన్‌తో జరిగిన యుద్దాలన్నీ మన దేశంలోని పాలకులకు రాజకీయంగా కూడా లబ్ది చేకూర్చాయి. 1971లో పాకిస్థాన్‌తో చేసిన యుద్ధంలో మనది పైచేయి కావడంతో నాటి ప్రధాని ఇందిరా గాంధీని అపరకాళిగా దేశ ప్రజలు కీర్తించారు. 1999లో కార్గిల్‌లో జరిగిన పరిమిత యుద్ధం వల్ల అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ప్రతిష్ఠ అమాంతం పెరిగిపోయి అదే సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో ఆయనకు విజయం కట్టబెట్టింది. ఇప్పుడు 370 రద్దు తరవాత ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ హీరోగా అవతరించారు. ఆ తరవాత అమిత్ షా, అజిత్ దోవల్‌లపైనా ప్రశంసలు వస్తున్నాయి. ఈ త్రయం ఎంతటి కార్యాన్నైనా చక్కబెడుతుందని భావిస్తున్నారు. దీంతో పాకిస్థాన్‌ను పూర్తిగా ఆత్మరక్షణ లోకి నెట్టేశారు. బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే కమ్యూనిస్టు పార్టీలు సైతం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యను సమర్థించక తప్పని పరిస్థితి కల్పించారు. విపక్షాలు మూకుమ్మడిగా కాశ్మీర్‌పై చర్యను సమర్థించారు. అయితే పాక్‌ను ఏనాటికీ నమ్మరాదని, జాగ్రత్త మరింత అవసరమన్న హెచ్చరికలు కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. పగబట్టిన పాములాంటి పాక్ అన్న సందేశాలు వస్తున్నాయి. అమెరికాలాంటి దేశాల అనుమతి లేకుండా పాకిస్తాన్ అణ్వాయుధాలతో దాడికి సాహసించకపోవచ్చు గానీ, అవే అణ్వాయుధాలు ఉగ్ర మూకల చేతుల్లో పడితే మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా లక్ష్యం నెరవేరింది. ఉగ్రవాద మూలాలలను నిర్మూలించడం ద్వారా పాక్‌కు బుద్ధి చెప్పాలని భారత ప్రజలు కోరుకుంటున్నారు.

## స్వచ్ఛతతోనే గ్రామాలకు అందం

### అందుకు ప్రజలు ముందుకు రావాలి

జనగామ,అక్టోబర్3 (ఆంఎన్‌ఎ): ప్రజలు పరిశుభ్రత పాటించినప్పుడే జిల్లా సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉంటుందని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. 30 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వీధుల్లోని హరిత హారం, పారిశుధ్యం, పిచ్చిమొక్కల తొలగింపు వంటి అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎవరైనా ఆరుబయట చెత్త పడేస్తే రూ.500 జరిమానా విధిస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించాలన్నారు. అలాగే వ్యాపార, వాణిజ్య షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. పేరుకుపోయిన చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు, పాడుబడిన ఇండ్లు, కంప చెట్లను ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తొలగించాలని కలెక్టర్ అన్నారు. అభివృద్ధే ధ్యేయంగా 30 రోజుల ప్రణాళిక పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు పలువురు దాతలు సైతం ముందుకొస్తున్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ప్రణాళికలో పాల్గొంటున్నారన్నారు. ఇటీవల చేపట్టి ప్రణాళిక పనుల్లో భాగంగా పలు అభివృద్ధి పనులు చేపట్టామని, ఆదర్శ గ్రామం దిశగా కృషి చేస్తున్నామన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో పెరుగుతోన్న అసహనం

### తెలంగాణ ఇవ్వకుంటే ఎక్కుడుండేవారన్న వాదన
### ఉప ఎన్నికలో విమర్శలకు పదను

హైదరాబాద్,అక్టోబర్3 (ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో అసహనం పెరుగుతోందని అర్థం అవుతోంది. తెలంగాణ తాము ఇస్తే అధికారం కెసిఆర్ అనుభవిస్తున్నారన్న భావ వ్యాప్తికి బాగా ప్రచారం చేస్తున్నారు. కేవలం కెసిఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందన్న భావన కలిగిస్తున్నారు. సోనియా త్యాగం వృధా అయ్యిందన్న భావన కలగచేస్తున్నారు. దీనికితోడు తెలంగాణ ఏర్పాటను సరిగా చేసుకోలేక పోయామన్న నైరాశ్యం వారిలో కనిపిస్తోంది. అందుకే తెలంగాణకు చెందిన కాంగ్రెస్ నాయకులు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఇప్పుడు కాయకల్ప చికిత్స కోసం పాకులాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి తావే కారణమంటూ, ఆనాడు సోనియా తలచుకోకుంటే...అంటూ ఇప్పుడు విహెచ్ లాంటి నేతలు వాపోతున్నారు. అందుకే వీరిని అధికార పార్టీ నేతలు ఎప్పటికప్పుడు ఎండగడుతున్నారు. పదేళ్ల పాలనలో ఏం చేశారంటూ నిలదీస్తున్నారు. అందుకే ఇప్పుడు హుజూర్‌నగర్ ఉప ఎన్నికలోనూ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై ప్రచారం చేస్తూనే తావే తెలంగాణ ఇచ్చామని కూడా ప్రచారం చేసుకుంటున్నారు. ప్రధానంగా పిసిసి చీఫ్ ఉత్తమ్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సాగుతున్నారు. కేసీఆర్‌ను అంచనా వేయడంలో కాంగ్రెస్ నాయకులు మొదటి నుంచీ తప్పులేచేస్తూ వచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆ క్రమంలో ఎన్నో వ్యూహాత్మక తప్పిదాలు చేసింది. అందుకే తెలంగాణ ఇచ్చినా ఆ ఖ్యాతి కాంగ్రెస్‌కు దక్కలేదు. తెలంగాణ ఇస్తే తెలంగాణ రాష్ట్ర సమితిని కేసీఆర్ కాంగ్రెస్‌లో విలీనం చేస్తారని కాంగ్రెస్ అధిష్ఠానం భావించింది. నిజానికి కేసీఆర్ కూడా ఒక దశలో అందుకు సిద్ధపడ్డారు. ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టే విషయమై స్పష్టమైన హామీ లభించకపోవడంతో కేసీఆర్ మనసు మార్చుకున్నట్లు సమాచారం. తెలంగాణ ఏర్పాటు బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందిన తర్వాత క్షేత్ర స్థాయిలో పరిస్థితులను మదింపు చేయడంలో కాంగ్రెస్ నాయకులు విఫలమయిన కారణంగానే గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తెలంగాణ ఇస్తే తామే సిఎం అన్నరీతిలో కాంగ్రెస్‌లో డజనుకుపైగా నాయకులు తయారయ్యారు. ప్రకటనలకే పరిమితం అయిన విహెచ్ లాంటి వారు కూడా తెరపైకి వచ్చారు. ఇదంతా గతం గతః అయినా ఇప్పుడు కాంగ్రెస్ నిత్యం పారాయణంగా మారింది. అందుకే ఇప్పటికప్పుడు అద్భుతాలు కావాలని కోరుకుంటోంది. ఆ మేరకు ప్రభుత్వం నడవడంలేదని అక్కసుతో ప్రజల్లోకి వెళ్లి నిలదీయాలని చూస్తోంది. వివిధ కార్యక్రమాలతో ప్రజల్లో పాపులాటీ సాధించే ప్రయత్నంలో ఉంది. తెలంగాణ రావడంలో తమదే కీలక పాత్ర అని చెప్పుకోవడం కోసం మళ్లీ ప్రచారంమొదలు పెడుతోంది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ కంటే తెలంగాణ కోసం కొట్లాడిన కేసీఆర్‌నే తెలంగాణ ప్రజలు నమ్మారు. పట్టం కట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ విశ్వరూపం ప్రదర్శించారు. అప్పటివరకు తెలంగాణలో బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీని చిన్నాభిన్నం చేశారు.కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చీల్చి ఆ పార్టీని బలహీనపరిచారు. తాను చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, మంచినీటి సరఫరా వంటి పథకాలకు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి ఆకర్షణీయ పేర్లు పెట్టి విశేష ప్రచారం కల్పించారు. అదే సమయంలో భారీఎత్తున సాగునీటి ప్రాజెక్టులు చేపట్టారు.ఏ బలం లేని కేసీఆర్ తన రాజకీయ చాతుర్యంతో నీరసింపజేశారు. ప్రజలలో వ్యతిరేకత రాకపోతుందా... కాంగ్రెస్ గెలవకపోతుందా... మనం ముఖ్యమంత్రులం కాకపోతామా... అనే కలలు కంటున్నారు. అందుకే కాంగ్రెస్ విమర్శలకు ప్రజల్లో పట్టు దక్కడం లేదు. ఉత్తమ్ తదితరులు కెసిఆర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శిస్తున్నా పట్టించుకోవడం లేదు.

# రైతులందరికి బీమా వర్తింపు

### అన్ని వర్గాలను అదుకుంటున్న ఘనత కెసిఆర్‌ది

నిజామాబాద్,అక్టోబర్3 (ఆర్‌ఎన్‌ఎ): రైతు బీమా విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్దతో పనిచేస్తోందని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. పసల్ బీమా కావచ్చు ఇతర పథకం కావచ్చు రైతులకు చేరవేసి వారిని రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పంట రుణాలను రెన్యువల్ చేసుకున్న రైతులకు గ్రామం యూనిట్‌గా బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రీమియం చెల్లించని రైతులకు నిబంధనల ప్రకారం, చెల్లించిన వారికి వందశాతం పెట్టుబడి రాయితీ వర్తిస్తుందన్నారు. వెనుకబడిన తరగతులను ప్రోత్సహించడానికి, వలసలు వెళుతున్న మత్స్య కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు జిల్లాలో 3.20 కోట్ల చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ ఒక్క వర్గాన్ని నిర్లక్ష్యం చేయకుండా సిఎం ఆదుకుంటున్నారని అన్నారు. రబీలో సకాలంలో పంటలు వేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల నుంచి బయటపడవచ్చనిరైతులకు సూచించారు. నవంబరు 15లోగా వరి నారుమడి వేసుకోవాలని, డిసెంబరు 15లోగా నాట్లు వేసుకుంటే మార్చి 31లోగా పంటలు చేతికొస్తాయన్నారు. అలాగే వేరుశనగ ,మొక్కజొన్న, పెసర పంటలను అధికారుల సూచనల మేరకు వేసుకుంటే వడగళ్ల వాన నుంచి పంటలను రక్షించుకోవచ్చని పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ జలాశయంలో పూర్తిస్థాయిలో నీళ్లున్నాయన్నారు. వీటితోపాటు చెరువుల్లో ఉన్న నీటిలో చేప పిల్లలను వదలడానికి ఈ పంపిణీ చేపట్టామన్నారు. పోచంపాడ్ జలాశయంలో , నిజాంసాగర్ జలాశయంలో ,ఇతర చెరువుల్లో కోట్ల చేపలను పెంచడానికి మత్స్యకార్మికులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. వలలు, తెప్పలు తదితర వాటిని రాయితీతో అందిస్తున్నామన్నారు. గొర్రెకాపర్లను ఆదుకోవడానికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించిందని మంత్రి పోచారం పేర్కొన్నారు. ఎన్‌సీడీసీ నుంచి రుణం పొందడానికి సీఎంతో మాట్లాడి రుణం పొందామన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.